@vaartanews @mvnewstv

# మన వార్త

www.mivaartanews.com
TGBIL/25/A0512
AP EDITION

విజయవాడ
సోమవారం 26 అక్టోబర్ 2026

ప్రతి అక్షరం... ప్రజల కోసం

సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-






తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.

సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది



SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




## ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ డౌన్

- ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు
- నిపుణుల హెచ్చరికలు
- శీతాకాలం సమీపించిన వేళ, ఢిల్లీలో మరోసారి కాలుష్యం కోరలు చాస్తోంది
- వాయు నాణ్యత తగ్గిపోయి హానికరగాలులతో దేశ రాజధాని ఉక్కిరిబిక్కిరవుతోంది.
- ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులపై ఇది తీవ్ర ప్రభావం

# ఏపీకి 'అర్ణబ్' తుపాను ముప్పు

- ఏపీ వైపు దూసుకొస్తున్న 'అర్ణబ్'..
- అధికారులను అప్రమత్తం చేసిన చంద్రబాబు
- అక్టోబర్ 28న బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
- తీరం దాటే సమయంలో గంటకు 140 కి.మీ వేగంతో పెనుగాలులు
- భారీ వర్ష సూచనతో అప్రమత్తమైన ప్రభుత్వం, రంగంలోకి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు
- తుఫాను సన్నద్ధతపై సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష



**అమరావతి**

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం 'అర్ణబ్' తుపానుగా బలపడుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, సహాయక కార్యక్రమాలపై ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, డీజీపీ హరీశ్ గుప్తా, వివిధ జిల్లాల కలెక్టర్లు, ఆర్టీజీ అధికారులతో పాటు వ్యవసాయ, విద్యుత్, ఇరిగేషన్, హోం, వైద్యారోగ్య, పౌరసరఫరాలు, పురపాలక, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, పక్కా ప్రణాళికతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ప్రస్తుతం విశాఖపట్నానికి తూర్పు ఆగ్నేయంగా 850 కిలోమీటర్లు, కాకినాడకు 930 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్న వాయుగుండం వేగంగా - మిగతా3లో

## సరకు రవాణాలో ఏపీ పోర్టులకు దేశంలో 2వ స్థానం

- 2024-25తో పోలిస్తే 12% వృద్ధి
- దేశంలో నాన్-మేజర్ పోర్టుల సరకు రవాణా సామర్థ్యంలో మొదటి స్థానంలో గుజరాత్
- ఏపీ రెండో స్థానంలో ఉంది. 2024-25తో పోలిస్తే ఇది సుమారు 12% ఎక్కువ.
- విశాఖపట్నం పోర్టు నుంచి 2025-26లో 91.17 ఎంఎంటీల సరకు రవాణా జరగ్గా, గత ఆర్థిక సంవత్సరంలో అది 82.62 ఎంఎంటీలుగా ఉంది.



**అమరావతి**

రాష్ట్రంలోని పోర్టుల ద్వారా 2025-26లో సుమారు 210 మిలియన్ మెట్రిక్ టన్నుల (వీమీ) సరకు రవాణా జరిగింది. 2024-25తో పోలిస్తే ఇది సుమారు 12 శాతం ఎక్కువ. దేశంలో నాన్- మేజర్ పోర్టుల సరకు రవాణా సామర్థ్యంలో గుజరాత్ మొదటి స్థానంలో నిలవగా, ఏపీ రెండో స్థానంలో ఉంది. ఈ వివరాలను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్-డీజీసీఐఎస్' తాజాగా వెల్లడించింది. విశాఖపట్నంలోని - మిగతా3లో



## ఉగ్రవాదం ప్రపంచ శాంతికి ప్రాణాంతకమైన ముప్పు

- ఉగ్రవాదాన్ని రాజకీయ సాధనంగా ఉపయోగించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు
- ప్రపంచ దేశాలు దృఢ సంకల్పంతో ఏకమై దీనిని ఎదిరించాలని పిలుపు
- విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్

## ఆర్థిక వ్యవస్థలపై దాడులే ఆధునిక యుద్ధాలు

- బ్యాంకింగ్ రంగానికి సైబర్ ముప్పు
- రూ.169 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సదుపాయాలు ఒడిశాతోపాటు దేశవ్యాప్తంగా ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తాయి
- భారత బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ ఉగ్రవాదుల నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉంది
- 'నేడు యుద్ధాలు కేవలం ఆయుధాలతో మాత్రమే జరగవని మనందరికీ తెలుసు
- ఒక దేశ ఆర్థిక వ్యవస్థపై దాడులు చేయడం ద్వారా కూడా ఆ దేశాన్ని బలహీనపరచవచ్చు
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



# పోలింగ్‌కు ముందే కూటమి సత్తా

- పలు మున్సిపాలిటీలు ఏకగ్రీవం
- పురపాలికల్లో పోలింగ్‌కు ముందే కూటమి సత్తా చాటింది
- పలు మున్సిపాలిటీల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- టీడీపీ 47, బీజేపీ 2, జనసేన ఒక డివిజన్‌లో ఏకగ్రీవమయ్యాయి
- మేయర్ సహా 16 డివిజన్లకు ఎన్నికలు జరగనున్నాయి.



**అమరావతి**

రాష్ట్రంలో పురపోరులో పోలింగ్‌కు ముందే కూటమి సత్తా చాటింది. పలు మున్సిపాలిటీల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఏకగ్రీవమైన అభ్యర్థులు ఎన్నికల రిటర్నింగ్ అధికారుల నుంచి డిక్లరేషన్ అందుకున్నారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు మున్సిపాలిటీని టీడీపీకి కైవసం చేసుకుంది. మున్సిపల్ ఛైర్మన్‌గా నంద్యాల రాఘవరెడ్డితో పాటు తెలుగుదేశానికి చెందిన 52 మంది కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారందరికీ మున్సిపల్ కార్యాలయంలో డిక్లరేషన్లు ఇచ్చారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం - మిగతా3లో



## మోదీపై ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు

- చెలరేగిన రాజకీయ దుమారం
- దేశవ్యాప్తంగా నిరసనలకు బీజేపీ సిద్ధం!
- ప్రధాని మోదీకి, దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని బీజేపీ డిమాండ్
- ప్రభుత్వం ప్రజాస్వామ్య సూత్రాల్ని ఉల్లంఘిస్తోంది
- సర్ ప్రక్రియ ద్వారా ఎన్నికల్ని ప్రభావితం చేస్తోంది
- ఓ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ తండ్రిని ప్రస్తావిస్తూ ఖర్గే చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీయగా

## ఆంధ్రప్రదేశ్‌పైకి దూసుకొస్తున్న

# అర్ణబ్

- ఏపీకి అతి తీవ్ర తుపాను ముప్పు..
- 8 జిల్లాల్లో హై అలర్ట్
- అక్టోబర్ 28న విశాఖ-బాపట్ల మధ్య తీరం దాటే అవకాశం
- బాపట్ల నుంచి విజయనగరం వరకు 8 జిల్లాలపై తీవ్ర ప్రభావం
- గంటకు 140 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే సూచన
- ప్రభావిత ప్రాంతాల ప్రజల తరలింపునకు ప్రభుత్వ ఏర్పాట్లు



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌కు తుపాను గండం పొంచి ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం బలపడి, అతి తీవ్ర తుపానుగా మారి రాష్ట్రంపై పంజా విసరనుందని వాతావరణ సంస్థల నివేదికలు చెబుతున్నాయి. ఈ తుపానుకు 'అర్ణబ్' (సముద్రం) అని నామకరణం చేశారు. ప్రభావం ముఖ్యంగా బాపట్ల నుంచి విజయనగరం వరకు ఉన్న 8 తీరప్రాంత జిల్లాలపై అధికంగా ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. అక్టోబర్ 28న మధ్యాహ్నం సమయంలో విశాఖపట్నం-బాపట్ల మధ్య తీరం దాటే అవకాశం ఉందని, ఆ - మిగతా3లో

# ఆర్థిక వ్యవస్థలపై దాడులే ఆధునిక యుద్ధాలు

ఆధునిక కాలంలో యుద్ధాలు కేవలం ఆయుధాలతోనే కాకుండా దేశాల ఆర్థిక వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని కూడా జరుగుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారత బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ ఉగ్రవాదుల నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఆదివారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఏర్పాటు చేసిన డేటా సెంటర్, సైబర్ భద్రత శిక్షణ సంస్థను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రూ.169 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సదుపాయాలు ఒడిశాతోపాటు దేశవ్యాప్తంగా ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తాయని తెలిపారు. 'నేడు యుద్ధాలు కేవలం ఆయుధాలతో మాత్రమే జరగవని మనందరికీ తెలుసు. ఒక దేశ ఆర్థిక వ్యవస్థపై దాడులు చేయడం ద్వారా కూడా ఆ దేశాన్ని బలహీనపరచవచ్చు. భారత్ ఆర్థికంగా బలపడుతున్న తరుణంలో, మన బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ నేరస్థులు, సైబర్ ఉగ్రవాదుల నుంచి రక్షించుకోవడం కూడా అంతే ముఖ్యం. నేడు, సైబర్ ముప్పుల రూపురేఖలు నిరంతరం మారుతున్నాయి. పాతబడిన వ్యవస్థలు, పాత శిక్షణా పద్ధతులు లేదా కాలం చెల్లిన సాధనాలతో ఈ కొత్త సవాళ్లను మనం ఎదుర్కోలేం. మనకు ఆధునిక మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం. ఇక్కడే ఈ కొత్త సైబర్ సెక్యూరిటీ సంస్థ కీలక పాత్ర పోషించనుంది' అని ప్రధాని మోదీ అన్నారు.

**సామాన్యులకు బ్యాంకింగ్ సేవలు**

దేశ బ్యాంకింగ్ రంగం ప్రస్తుతం ప్రపంచంలోనే సమర్థంగా పనిచేస్తున్న వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగిందని ప్రధాని



పేర్కొన్నారు. ప్రజలకు రోజులో 24 గంటలూ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. చిన్న వ్యాపారులు, సంప్రదాయ చేతివృత్తుల వారు, వీధి వ్యాపారులు, అసంఘటిత రంగ కార్మికులకు అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా ప్రయోజనాలు అందుతున్నాయని వివరించారు. గతంలో బ్యాంకింగ్ సేవలు కొద్దిమంది సంపన్నులు, పలుకుబడి ఉన్నవారికే ఎక్కువగా పరిమితమయ్యాయని మోదీ విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ధనికులకు రుణాలు సులభంగా లభించేవని, పేదలు, మధ్యతరగతి ప్రజలు, మహిళలకు తగిన అవకాశాలు దక్కలేదని ఆరోపించారు. 2014 తర్వాత సమతుల్య విధానాన్ని అనుసరించడంతో పరిస్థితుల్లో మార్పు వచ్చిందని పేర్కొన్నారు. గతంలో డెబిట్, క్రెడిట్ కార్డులు సామాన్యులకు అందని విలాస వస్తువులుగా ఉండేవని, ప్రస్తుతం అవి విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయని తెలిపారు.

**రానున్న దశాబ్దంలో మరింత సమర్థమైన సేవలు**

గత పదేళ్లలో బ్యాంకింగ్ సేవలు అందని వర్గాలకు వాటిని చేరువ చేయడంపై దృష్టి సారించామని మోదీ చెప్పారు. ఇక రానున్న దశాబ్దంలో బ్యాంకింగ్ వ్యవస్థను మరింత సమర్థంగా, విశ్వసనీయంగా మార్చడమే లక్ష్యమని తెలిపారు. బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండటమే కాకుండా, వాటిని ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వినియోగించుకునేలా చూడాలని అభిప్రాయపడ్డారు. డిజిటల్ లావాదేవీల భద్రత, వేగవంతమైన సేవలు, ఆర్థిక వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించడం భవిష్యత్తులో కీలకమని ఆయన వ్యాఖ్యల

**రూ.169 కోట్లతో కీలక సదుపాయాలు**

భువనేశ్వర్‌లో ఆర్‌బీఐ ఏర్పాటు చేసిన డేటా సెంటర్, సైబర్ భద్రత శిక్షణ సంస్థను ప్రధాని ప్రారంభించారు. డిజిటల్ బ్యాంకింగ్ సేవల భద్రతను బలోపేతం చేయడం, సైబర్ ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచడం వంటి లక్ష్యాలతో ఈ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా బ్యాంకింగ్ సేవలు విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ భద్రతపై ప్రత్యేక దృష్టి అవసరమని మోదీ అన్నారు. కొత్త సదుపాయాలు ఈ దిశగా ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక ఒడిశా అభివృద్ధిపై కూడా ప్రధాని మాట్లాడారు. గనుల రంగం నుంచి మైక్రోచిప్‌ల తయారీ వరకు పలు రంగాల్లో రాష్ట్రం భవిష్యత్తును నిర్మించుకోగలదని అన్నారు. యువతకు కొత్త అవకాశాలు కల్పించే అనేక మార్గాలు తెరుచుకుంటాయని పేర్కొన్నారు.

# మోదీపై ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు

కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ మధ్య రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. బిహార్ రాజధాని పట్నాలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ తండ్రిని ప్రస్తావిస్తూ ఖర్గే చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీయగా బీజేపీ మండిపడింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా పలువురు బీజేపీ నేతలు కాంగ్రెస్ అధ్యక్షుడిపై విమర్శలు గుప్పించారు. ప్రధాని మోదీకి, దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. ఇదే సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడి వ్యాఖ్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టేందుకు కూడా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

బిహార్ తొలి ముఖ్యమంత్రి శ్రీకృష్ణ సింగ్ 139వ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ ఘటన జరిగింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడిన వారందరినీ కాంగ్రెస్ పార్టీ జైలుకు పంపిస్తుందని ఖర్గే అన్నారు. ఇక్కడ ఖర్గే ప్రసంగిస్తున్న సమయంలోనే సంతోష్ కుమార్ అనే ఓ వ్యక్తి 'తిరుగుబాటు జరిగేంతవరకు మోదీ ఎక్కడికీ వెళ్లరు' అని అరిచారు. దీంతో స్పందించిన ఖర్గే ఆగ్రహంతో 'మోదీ కా బాప్ భీ జాయేగా, బాప్ భీ జాయేగా (మోదీనే కాదు, మోదీ తండ్రి కూడా వెళ్లాల్సిందే)' అని అన్నారు. ఈ వ్యాఖ్యల అనంతరం సభలో అలజడి రేగగా, నినాదాలు చేసిన ఆ వ్యక్తిని సభ నుంచి బయటికి పంపించారు. తన వ్యాఖ్యలపై ఖర్గే సమర్థించుకుంటూ, ప్రభుత్వం ప్రజాస్వామ్య సూత్రాల్ని ఉల్లంఘిస్తోందని, సర్ ప్రక్రియ ద్వారా ఎన్నికల్ని ప్రభావితం చేస్తోందని అన్నారు. ఇక ఖర్గే వ్యాఖ్యలను ఎన్డీఏ నేతలు తీవ్రంగా ఖండించారు.

**అమిత్ షా తీవ్ర విమర్శలు**

ఖర్గే వ్యాఖ్యలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎక్స్‌లో స్పందించారు. పట్నాలో మోదీ తండ్రిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా ఖర్గే అన్ని హద్దులను దాటారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు గతంలోనూ మోదీని,



ఆయన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని షా విమర్శించారు. వరుస ఓటములతో కాంగ్రెస్ తీవ్ర నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయిందని, చేసేదేం లేక వ్యక్తిగత దూషణలకు దిగుతోందని ఆరోపించారు.

'కాంగ్రెస్ అధ్యక్షుడి నోటి వెంట వచ్చిన మాటలు రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనం. ప్రధాని మోదీ, ఆయన కుటుంబంపై కాంగ్రెస్ నేతలు అసభ్యకరమైన పదజాలాన్ని ఉపయోగించడం ఇదేం మొదటిసారి కాదు. గతంలో ఆయన తల్లిని అవమానించారు. ఆయనను మర్చంట్ ఆఫ్ డెత్ అన్నారు. ఆయన పేదరికాన్ని ఎగతాళి చేస్తూ ఛాయ్‌వాలా అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ రోజురోజుకూ హద్దుల్ని దాటుతోంది. సంయమనం కోల్పోతుంది' అని అమిత్ షా పేర్కొన్నారు.

**నిబిన్ నబిన్ ఫైర్**

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కూడా ఖర్గే వ్యాఖ్యలను తప్పుబట్టారు. రాజకీయ ప్రత్యర్థుల్ని విమర్శించేటప్పుడు కూడా గౌరవం, మర్యాదలు పాటించాలని పేర్కొన్నారు. మరణించిన కుటుంబ సభ్యులను రాజకీయ ప్రసంగాల్లోకి తీసుకురావడం తగదని అన్నారు. దేశాభివృద్ధి, ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాలపై మాట్లాడేదేం లేకనే ప్రతిపక్షాలు ఇలా వ్యక్తిగత దాడులకు దిగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఇంకా ఖర్గే వ్యాఖ్యలపై స్పందించిన బీజేపీ కూడా ఎక్స్‌లో తీవ్ర విమర్శలు చేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు రౌడీలు, గూండాలు వాడే భాషను ఉపయోగిస్తున్నారని పేర్కొంది. ఇది రాజకీయం కాదు, అచ్చం మాఫియా గ్యాంగ్ ప్రవర్తనలా ఉందని విమర్శించింది. ఇతర కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, గిరిరాజ్ సింగ్, పీయూష్ గోయల్ సహా మాజీ మంత్రులు, ఎంపీలు ధర్మేంద్ర ప్రదాన్, రవిశంకర్ ప్రసాద్, బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర, బిహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరీ కూడా ఖర్గే వ్యాఖ్యల్ని ఖండిస్తూ, తక్షణమే మోదీకి, దేశప్రజలకు ఖర్గే, రాహుల్, సోనియా గాంధీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

**ఖర్గేపై పోలీసులకు ఫిర్యాదు**

కాంగ్రెస్ అధ్యక్షుడి వ్యాఖ్యలపై బిహార్ బీజేపీ పోలీసుల్ని ఆశ్రయించింది. పట్నాలోని పోలీస్ స్టేషన్‌లో మల్లికార్జున్ ఖర్గేపై ఫిర్యాదు నమోదు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని, ఆయన తండ్రిని ఉద్దేశించి ఖర్గే అవమానకరమైన భాష ఉపయోగించారని ఆరోపించిన అక్కడి నాయకులు, ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఎస్ఐఆర్, బ్లాక్‌మనీని ప్రస్తావిస్తూ ఖర్గే విమర్శలు**

వివాదానికి ముందు ఖర్గే తన ప్రసంగంలో కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సర్‌ను తక్షణమే నిలిపివేయాలని, ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. భవిష్యత్తులో ఎన్నికల్ని బ్యాలెట్ పేపర్ విధానంలో నిర్వహించాలని, గత రెండేళ్లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ తొలి 100 రోజుల్లో నల్లధనాన్ని తిరిగి తీసుకొస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేస్తూ, ఆ డబ్బు ఏమైందని ఖర్గే ప్రశ్నించారు. ఇంకా బిహార్ మాజీ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీశ్ కుమార్ ఎన్డీయే కూటమితో కలవడాన్ని కూడా ఖర్గే విమర్శించారు. అయితే దీనిపై స్పందించిన జేడీయూ ఖర్గే ఆరోపణల్ని తోసిపుచ్చింది. ఎన్నికలు నిష్పాక్షికంగా, పారదర్శకంగా జరిగాయని పేర్కొంది.

# ఓటును, దేశాన్ని కాపాడుకుందాం

## నవంబర్ 1న భారీ ర్యాలీకి రాహుల్ గాంధీ పిలుపు

ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు, ఓట్ల చోరీ ఆరోపణలపై నిరసనగా నవంబర్ 1న ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రకటించారు. 'సేవ్ ది ఓట్ సేవ్ ది కంట్రీ' పేరుతో జన మార్చ్, భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత, వ్యాపారులు సహా ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఓటర్ల జాబితాల నుంచి పేర్లను తొలగిస్తున్నారు. నిబంధనలను, చట్టాలను ఉల్లంఘిస్తున్నారు. అక్రమాలపై ప్రశ్నలు లేవనెత్తిన వారిపై లాఠీలతో దాడులు చేశారు. దీనిని ఏ పరిస్థితుల్లోనూ ప్రజలు మౌనంగా సహించరు. నవంబర్ 1న ఢిల్లీకి పదండి. ఓటును, దేశాన్ని కాపాడుకుందాం. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు పౌరులు ఉద్యమంలో భాగస్వాములు కావాలి. ఓటు మీది. పోరాటమూ మీదే' అంటూ రాంలీలా మైదాన్?, ఢిల్లీ అని పోస్ట్?లో రాసుకొచ్చారు. అలాగే గమనిక అని తమ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పిస్తున్న బీజేపీ, దాని మిత్రపక్షాలకు వ్యంగ్యంగా కృతజ్ఞతలు తెలిపారు. ర్యాలీకి ముందు మరో ఏడు రోజులపాటు ఇదే ఉత్సాహంతో ప్రచారం కొనసాగించాలని వ్యాఖ్యానించారు.

**మూడు రోజులపాటు ఢిల్లీలోనే ఎంపీలు**

ఇదిలా ఉండగా, ర్యాలీ నేపథ్యంలో పార్టీ ఎంపీలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక సూచనలు చేశారు.



అక్టోబర్ 30,31, నవంబర్ 1 తేదీల్లో ఎంపీలంతా ఢిల్లీలో అందుబాటులో ఉండాలని కోరారు. ఓట్ల చోరీ ఆరోపణలు, ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో ఎంపీలు పాల్గొనేలా కాంగ్రెస్ నాయకత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఎన్నికల అక్రమాలు, ఓట్ల తొలగింపును నిరసిస్తూ అక్టోబర్ 30న ఢిల్లీలోని అశోక్ హోటల్ వేదికగా విపక్షాలు మాక్ పార్లమెంట్ నిర్వహించను న్నాయి. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న జజుజ తీరును ఎండగడుతూ ప్రతీకాత్మకంగా ఆయనపై ఈ వేదికగా ప్రజా అభిశంసన చేపట్టనున్నారు. ఇండియా కూటమికి చెందిన ఎంపీలు, అగ్రనేతలంతా హాజరయ్యే ఈ సమావేశంలో జజుజకి వ్యతిరేకంగా ఒక బహిరంగ ప్రజా తీర్పును కూడా వెల్లడించనున్నారు. ఈ మాక్ పార్లమెంట్ ముగిసిన అనంతరం నవంబర్ 1న ఓట్ చోరీకి వ్యతిరేకంగా పదిలక్షల మందితో రాంలీలా మైదానానికి ఢిల్లీ చలో మార్చ్ నిర్వహించాలని కాంగ్రెస్ తలపెట్టింది.

**రామమందిర విరాళాలపై జైరాం రమేశ్ ప్రశ్నలు**

ఇదిలా ఉండగా, అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ఆలయ విరాళాల వ్యవహారాన్ని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ మరోసారి ప్రస్తావించారు. ప్రధాని మోదీ ఉత్తరప్రదేశ్ పర్యటన నేపథ్యంలో ఈ అంశంపై ఆయన స్పందించారు. ఆలయానికి వచ్చిన విరాళాలు, కానుకల లెక్కలపై అనుమానాలు ఉన్నా యని పేర్కొంటూ నిష్పక్షపాత దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఆలయ ట్రస్టీల నియామకంపైనా ప్రశ్నలు లేవనెత్తా రు. బీజేపీ, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్‌తో సంబంధా లున్న వ్యక్తులను ట్రస్టీలుగా నియమించారని ఆరోపించారు. విరాళాల వ్యవహారంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలను ప్రస్తావిస్తూ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. 2021లో నిధి సమర్పణ కార్యక్రమం, కార్పస్ విరాళాల ద్వారా మొత్తం రూ.3,264 కోట్లు సేకరించినట్లు ఆర్ఎస్ఎస్, ఆలయ ట్రస్టు వెల్లడించిన గణాంకాలను జైరాం రమేశ్ ప్రస్తావించారు. 2024లో తొమ్మిది నెలల్లో 13.55 కోట్ల మంది భక్తులు అయోధ్యకు వచ్చారని, 2025 మహాకుంభమేళా సమయంలో మరో పది కోట్ల మంది వరకు సందర్శించారని పేర్కొన్నారు. 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 ఫిబ్రవరి 28 వరకు సుమారు 16 కోట్ల మంది భక్తులు వచ్చినట్లు చెబుతున్నప్పటికీ, హుండీలు, కౌంటర్ల ద్వారా రూ.82.78 కోట్ల కానుకలు మాత్రమే వచ్చినట్లు నివేదికలు పేర్కొంటున్నాయని ఆయన అన్నారు. ఈ గణాంకాల మధ్య ఉన్న వ్యత్యాసంపై స్పష్టత ఇవ్వాలని కోరారు.

## ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ డౌన్



కొన్నేళ్లుగా శీతాకాలం వస్తోందంటే చాలు ఢిల్లీ ప్రజలను చలితో పాటు కాలుష్య భయమూ వెంటాడుతోంది. పొగమంచు, పడిపోతున్న గాలి నాణ్యత ప్రజారోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎలాంటి శ్వాసకోశ సమస్యలు లేనివారిని సైతం ఈ విషగాలి వదలడం లేదు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఈ కాలుష్యానికి అత్యంత సులువుగా బలవుతున్నారు. ఆస్తమా, ఊపిరితిత్తులు... జ్వరాణ వంటి దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలు ఉన్నవారికి వాయు కాలుష్యం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. కేవలం ఊపిరితిత్తులకే కాకుండా, ఇది హృద్రోగాలకూ దారితీసి, గుండెపోటు ముప్పును గణనీయంగా పెంచుతుందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "కాలుష్యం పెరిగితే సమస్యలు తీవ్రమవుతాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది. ఆస్తమా, సీఓపీడి, ఊపిరితిత్తుల్లో ఫైబ్రోసిస్ లాంటి ముందస్తు సమస్యలు ఉన్నవారికి ఈ కాలుష్యం శాపంగా మారుతుంది. ఇక గర్భిణీలు కూడా దీనివల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనే ప్రమాదం ఉంది"

దేశ రాజధానిలో కాలుష్య కోరల నుంచి రక్షించుకోవడానికి ప్రజలు తక్షణ స్వీయజాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ స్థాయిలను బట్టి బయటకు వెళ్లాలో, వద్దో తమపై తామే ఆంక్షలు విధించుకోవాలని స్పష్టం చేస్తున్నారు. "ఈ సీజన్‌లో గాలి నాణ్యత దెబ్బతింటుంది. ఏక్యూఐ300 దాటితే శ్వాసకోశ, గుండె జబ్బులు ఉన్నవారు బయట తిరగడం తగ్గించాలి. అదే 400 దాటితే అసలు బయటకు రాకూడదు. ఇక ఏక్యూఐ 200 నుంచి 300 మధ్య ఉంటే మాత్రం బహిరంగ ప్రదేశాల్లో వ్యాయామాలు పూర్తిగా మానుకోవాలి" అని ఊపిరితిత్తుల నిపుణుడు డా.వివేక్ నాంగియా తెలిపారు.

**అనవసరంగా బయట తిరగకపోవడమే!**

కాలుష్య ప్రాంతాలకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని ఇళ్లలోని గాలి నాణ్యతను మెరుగుపరుచుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని జనరల్ ఫిజీషియన్లు సూచిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు... తగిన జాగ్రత్తలు తీసుకుంటూ..అనవసరంగా బయట తిరగకపోవడమే ఉత్తమమని చెబుతున్నారు.

"కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్లేటప్పుడు మాస్క్ ధరించడం మంచి రక్షణ కవచంగా ఉంటుంది. అలాగే ఇళ్లలో, ఇండోర్‌లో గాలి నాణ్యతను మెరుగుపరచుకోవాలి. ముఖ్యంగా శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు.. ఈ నిబంధనలను తప్పక పాటించాలి"

ఢిల్లీలో చలికాలం అంటే కేవలం ఉష్ణోగ్రతలు పడిపోవడం మాత్రమే కాదు. ఊపిరి సలపని గాలి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కొన్నేళ్లుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవస్థ కాలుష్య నివారణకు కఠినమైన ఆంక్షలను అమలు చేస్తున్నప్పటికీ పరిస్థితిలో ఆశించిన మార్పులు రావడంలేదు.

## ఉగ్రవాదం ప్రపంచ శాంతికి ప్రాణాంతకమైన ముప్పు

ఉగ్రవాదాన్ని రాజకీయ సాధనంగా వాడుకోవడాన్ని అంగీకరించబోమని విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు. కొన్ని దేశాలు ఉగ్రవాదం పట్ల కఠినంగా వ్యవహరించకపో వడం వల్లే ఈ ముప్పు ఇంకా కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత అనుభవా లు ఎన్నో గుణపాఠాలు



నేర్పుతున్నా, కొన్ని దేశాలు ఇప్పటికీ రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నాయని పాకిస్థాన్‌ను పరోక్షంగా విమర్శించారు. ఢిల్లీలో జరిగిన చిన్మయ మిషన్ 75వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన ఎక్కడో ఒక చోట జరిగే యుద్ధం, ప్రపంచమంతటా ఉన్న శాంతికి ముప్పుగా పరిణమిస్తుందని హెచ్చరించారు. "ఉగ్రవాదం శాంతికి మరో ప్రాణాంతక ముప్పు. దానిని రాజకీయ సాధనంగా ఉపయోగించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. దానిని ఎన్నటికీ సమర్థించలేం. ఎన్నడూ హేతుబద్ధం చేయలేం. అయినప్పటికీ, అన్ని దేశాలు ఏమాత్రం సహనాన్ని ప్రదర్శించకపోవడం వల్ల ఇది కొనసాగుతూనే ఉంది. చరిత్ర ఎన్నో పాఠాలు నేర్పినప్పటికీ, కొన్ని దేశాలు ఇప్పటికీ రాజకీయ లెక్కలకే ప్రాధాన్యతనిస్తున్నాయి."

ఉక్రెయిన్, పశ్చిమాసియాలో ప్రస్తుతం జరుగుతున్న ఘర్షణలను ప్రస్తావించిన జైశంకర్ దౌత్యం, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. సంక్షోభాల సమయంలో ఐక్యరాజ్యసమితి కేవలం ప్రేక్షకపాత్ర వహించకూడదని, నాయకత్వం వహించి పరిష్కార మార్గాలకు బాటలు వేయాలని జైశంకర్ అన్నారు. ప్రస్తుతం లోపభూయిష్టమైన ప్రపంచంలో జీవిస్తున్నామని, అయితే దాన్ని మరింత మెరుగుపరిచేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా దాని ప్రభావం ఆ ప్రాంతానికే పరిమితం కాదని జైశంకర్ స్పష్టం చేశారు. ఒక చోట జరిగే సంఘర్షణ ప్రపంచవ్యాప్తంగా శాంతికి ముప్పుగా మారుతుందని పేర్కొన్నారు. అందువల్ల అన్ని దేశాలు శాంతిని కాపాడేందుకు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉగ్రవాదం, యుద్ధాలు ప్రపంచ దేశాల భద్రతతో పాటు అభివృద్ధిపైనా ప్రభావం చూపుతాయని ఆయన వ్యాఖ్యానించారు. చరిత్ర నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలను కొన్ని దేశాలు విస్మరిస్తున్నాయని జైశంకర్ అన్నారు. ఉగ్రవాదం విషయంలో రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, అన్ని దేశాలు ఒకే విధమైన కఠిన వైఖరిని అవలంబించాలని సూచించారు.

ఉక్రెయిన్, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణలను ప్రస్తావిస్తూ, సమస్యలను పరిష్కరించుకోవడానికి దౌత్యం, చర్చలే మార్గమని జైశంకర్ అన్నారు. యుద్ధాల వల్ల ఏర్పడే సంక్షోభాలను మరింత తీవ్రతరం చేయకుండా, చర్చల ద్వారా పరిష్కారాలను కనుగొనాలని సూచించారు. భారత్ మొదటి నుంచి ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తోందని పేర్కొన్నారు. చర్చలు, దౌత్యానికి ప్రాధాన్యం ఇవ్వాలనే భారత వైఖరి ప్రపంచ దేశాల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోందని అన్నారు. ప్రపంచంలో ప్రస్తుతం అనేక సమస్యలు ఉన్నప్పటికీ, పరిస్థితులను మెరుగుపరిచేందుకు దేశాలు నిరంతరం కృషి చేయాలని జైశంకర్ అభిప్రాయపడ్డారు. యుద్ధాలు, హింసకు బదులుగా శాంతి, సహకారం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రపంచ దేశాల మధ్య పరస్పర అవగాహన పెరిగినప్పుడే సంక్షోభాలకు పరిష్కారాలు కనుగొనడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

**శ్రేయస్సు, అభివృద్ధి అందరికీ అందాలి**

ప్రపంచంలో అభివృద్ధి, శ్రేయస్సు ఒకవైపు, సంఘర్షణ, హింస మరోవైపు ఉంటాయని జైశంకర్ అన్నారు. ఈ రెండింటినీ విడివిడిగా చూడలేమని పేర్కొన్నారు. ప్రపంచీకరణ, సంక్లిష్టమైన సరఫరా గొలుసులు, పరస్పరం అనుసంధానమైన మార్కెట్ల నేపథ్యంలో ఒక ప్రాంతంలో నెలకొనే అస్థిరత ఇతర ప్రాంతాలపైనా ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రపంచంలోని కొంతమంది ప్రజలు మాత్రమే శ్రేయస్సుతో జీవిస్తూ, మిగిలిన వారు లేమిలో కొనసాగితే స్థిరమైన అభివృద్ధి సాధ్యం కాదని జైశంకర్ పేర్కొన్నారు. ఉగ్రవాదం సహా ప్రపంచం ఎదుర్కొంటున్న ఉమ్మడి ముప్పులపై దేశాలు మరింత స్పష్టమైన అవగాహన పెంచుకోవాలని జైశంకర్ అన్నారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ, అన్ని వ్యక్తీకరణల్లోనూ ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సమాజం దృఢ సంకల్పంతో ఏకం కావాలని పిలుపునిచ్చారు.

# ఏపీకి 'అర్ణబ్' తుపాను ముప్పు

-మొదటిపేజీ తరువాయి

బలపడుతోంది. ఇది అక్టోబర్ 26 ఉదయానికి తుపానుగా, అదే రోజు రాత్రికి తీవ్ర తుపానుగా, 27వ తేదీ నాటికి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అక్టోబర్ 28న ఉదయం నుంచి మధ్యాహ్నం లోగా బాపట్ల--విశాఖపట్నం మధ్య తీరం దాటవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుత అంచనాల ప్రకారం కోనసీమ-యానాం-కాకినాడ తీర ప్రాంతంలో తీరం దాటే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని, కొన్ని సందర్భాల్లో గాలి వేగం గంటకు 140 కిలోమీటర్ల వరకు చేరవచ్చని హెచ్చరించారు.

**భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు**

తుఫాను ప్రభావంతో అక్టోబర్ 27, 28 తేదీల్లో ఉత్తరాంధ్ర, మధ్య కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలపై గాలులు, వర్షాల ప్రభావం తీవ్రంగా ఉంటుందని అంచనా వేశారు. అనకాపల్లి జిల్లాలో అత్యధికంగా సగటున 292.55 మి.మీ., అల్లూరి సీతారామరాజు జిల్లాలో 281.17 మి.మీ., విశాఖపట్నంలో 253.87 మి.మీ., శ్రీకాకుళంలో 249.18 మి.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఐదు రోజుల సగటు వర్షపాతం 95 మి.మీ.గా ఉంటుందని అంచనా వేశారు.

**చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష**



సమీక్ష సందర్భంగా సీఎం చంద్రబాబు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారుల బోట్లన్నీ వెంటనే తీరానికి తిరిగి వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సహాయక చర్యల కోసం రాష్ట్రంలో 10 ఎన్‌డీఆర్ఎఫ్, 11 ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యుత్ పునరుద్ధరణకు అవసరమైన సామగ్రితో బృందాలను సిద్ధంగా ఉంచాలన్నారు. భారీ వర్షాల వల్ల వచ్చే వరద నీటిని రిజర్వాయర్లలోకి మళ్లించి, నీటిని నిల్వ చేసేందుకు ప్రణాళి కలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. తుపాను తీవ్రత దృష్ట్యా ప్రజలు, అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, సముద్రం అల్లకల్లోలంగా ఉంటున్నందున ఎవరూ వేటకు వెళ్లవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

# లోకల్ బాడీ ఎన్నికల్లో పతాక స్థాయికి ఘర్షణలు



**కర్నూలు** : ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు రాష్ట్ర రాజకీయాలపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైన నామినేషన్ల దశలోనే అభ్యర్థులను అడ్డుకోవడం, పత్రాలను బలవంతంగా లాక్కొని చించేయడం, పరస్పరం దాడులకు దిగడం వంటి ఘటనలు కలవరపెడుతున్నాయి. అధికార తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటుండటంతో అసలు తప్పు ఎవరిదన్నది తేల్చడం కష్టంగా మారింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు కూడా ఇరు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల మధ్య ఘర్షణలు జరిగినట్లు చూపిస్తున్నాయి. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు నామినేషన్ దాఖలు చేసే అవకాశం కల్పించడం అధికారుల బాధ్యత. అలాంటి ప్రక్రియలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయన్న ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను టీడీపీ వర్గీయులు లాక్కొని చించేశారన్న వీడియోలు ప్రచారంలోకి వచ్చాయి. మరోవైపు వైసీపీ బలంగా ఉన్న ప్రాంతాల్లో టీడీపీ అభ్యర్థులపైనా దాడులు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనల్లో ఎవరు బాధితులు, ఎవరు బాధ్యులు అనే అంశాన్ని రాజకీయ వాదనల ఆధారంగా కాకుండా పూర్తి ఆధారాలతో నిర్ధారించాల్సిన అవసరం ఉంది.వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త రామకృష్ణారెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం, రాష్ట్రంలోని 11 జిల్లాల్లో 76 హింసాత్మక ఘటనలు జరిగినట్లు ఆ పార్టీ ఆరోపించింది. వీటిలో వైఎస్సార్ కడప జిల్లాలో 22, పల్నాడులో 18, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో కలిపి 11 ఘటనలు ఉన్నట్లు పేర్కొంది. అయితే ఈ ఆరోపణలను టీడీపీ ఖండిస్తోంది. ఎన్నికల్లో ఓటమి భయంతో వైసీపీ అనవసర వివాదాలు సృష్టిస్తోందని, ఎన్నికలను వాయిదా వేయించేందుకు ప్రయత్నిస్తోందని అధికార పార్టీ నేతలు విమర్శిస్తున్నారు.పెనుకొండ, కడప , చిత్తూరు , శ్రీకాళహస్తి , పులివెందుల వంటి ప్రాంతాల్లో నామినేషన్ల విషయంలో వివాదాలు చోటుచేసుకున్నట్లు ప్రచారంలో ఉన్న వీడియోలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. మరోవైపు పుంగనూరు పరిధిలోని సదుం, రాయచోటి, మాచర్ల ప్రాంతాల్లో టీడీపీ నేతలు, అభ్యర్థులపై దాడులు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. చిత్తూరులో వాకర్ సాయంతో నామినేషన్ వేసేందుకు వెళుతున్న టీడీపీ మహిళా అభ్యర్థి అరుణకు ఎదురైన పరిస్థితికి సంబంధించిన వీడియో కూడా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. కర్నూలు, అన్నమయ్య, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో వైసీపీ శ్రేణులు టీడీపీ అభ్యర్థులను అడ్డుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అదే సమయంలో పల్నాడు, మార్కాపురం, తిరుపతి ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థులకు నామినేషన్ల విషయంలో ఆటంకాలు ఎదురైనట్లు ప్రచారం జరిగింది. కొన్ని ఘటనల్లో వాహనాలు ధ్వంసం కాగా, పోలీసు సిబ్బంది కూడా గాయపడినట్లు సమాచారం. జనసేన కార్యకర్తలపైనా కొన్ని చోట్ల వైసీపీ అభ్యర్థులను అడ్డుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి.ఈ పరిణామాలతో పోలీసుల వ్యవహారశైలిపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమకు అనుకూలంగా వ్యవహరించడం లేదని ఇరు పార్టీల నేతలు పరస్పరం ఆరోపించుకుంటున్నారు. శ్రీసత్యసాయి జిల్లా చెన్నె కొత్తపల్లిలో నామినేషన్ కేంద్రం వద్ద అభ్యర్థులను అనుమతించే విషయంలో వివాదం తలెత్తినట్లు టీడీపీ నేతలు ఆరోపించారు. పోలీసులు లాఠీచార్జి చేయడంతో కొందరికి గాయాలైనట్లు కూడా పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై పూర్తి వివరాలు, అధికారిక నిర్ధారణ అవసరం.మొత్తంగా చూస్తే, స్థానిక ఎన్నికలు రాజకీయ ఆధిపత్య పోరుకు వేదికగా మారుతున్నాయి. ఏ పార్టీకి బలం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆ పార్టీ నేతలు తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఏ పార్టీకి చెందిన వారైనా నామినేషన్లను అడ్డుకోవడం, దాడులకు దిగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమే. ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రతి అభ్యర్థికి స్వేచ్ఛగా నామినేషన్ దాఖలు చేసే అవకాశం కల్పించడమే ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించే మార్గం.

# ఎన్నికల వివాదాలకు ఫుల్ స్టాప్ ఎప్పుడు

**విజయవాడ** : ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో అనూహ్యమైన రాజకీయ, చట్టపరమైన సమీకరణాలు వెలుగులోకి వస్తున్నాయి. స్థానిక పోరులో నామినేషన్ల ఘట్టం నుంచి మొదలైన వివాదం ఇప్పుడు అత్యున్నత న్యాయస్థానం వరకు చేరినప్పటికీ.. అధికార కూటమి, పొలిటికల్ సర్కిళ్లలో మరో ఆసక్తికరమైన ప్రచారం నడుస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో నామినేషన్లను అడ్డుకున్నారు అనే ప్రచారాన్ని ఉద్దేశపూర్వకంగానే తీవ్రతరం చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ల తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికల బహిష్కరణ ప్రకటన వచ్చేలా మానసిక వాతావరణాన్ని సిద్ధం చేసుకుంటోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని పలు సమస్యాత్మక కేంద్రాలు, మున్సిపాలిటీలలో స్థానిక అధికారులు , పోలీసులు తీసుకుంటున్న భద్రతా చర్యలే. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా, అనవసర ఘర్షణలను నివారించేందుకు పోలీసులు నామినేషన్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి, సంబంధిత అభ్యర్థులు, ప్రతిపాదకులను మాత్రమే లోపలికి అనుమతిస్తున్నారు. అయితే, వైసీపీకి చెందిన కొందరు ముఖ్యనేతలు తమ అనుచరగణంతో భారీ రాలీలుగా నామినేషన్ కేంద్రాల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించినప్పుడు పోలీసులు అడ్డుకోవడం సాధారణ పరిపాలనా ప్రక్రియలో భాగమే. కానీ, దీన్నే పక్కాగా తమకు అనుకూలంగా మలుచుకుని మా నేతలను పోలీసులు దగ్గరుండి అడ్డుకుంటున్నారు, నామినేషన్లు వేయనివ్వడం లేదు అని వైసీపీ డిజిటల్ స్పేస్‌లో ముమ్మర ప్రచారం నిర్వహిస్తోందనేది టీడీపీ నేతల ఆరోపణ. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం తర్వాత వైసీపీ క్షేత్రస్థాయి యంత్రాంగం , ద్వితీయ శ్రేణి నాయకత్వం తీవ్రమైన నైరాశ్యంలో కూరుకుపోయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోతే, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మిగిలి ఉన్న కొద్దిపాటి ఉనికి కూడా తుడిచిపెట్టుకుపోతుందనే భయం నాయకుల్లో వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో పోటీ చేసి ఓడిపోవడం కంటే.. ప్రభుత్వ అరాచకాలకు నిరసనగా ఎన్నికలను బహిష్కరించాం అనే నరేటివ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లడమే పార్టీ ప్రతిష్టకు క్షేమకరమని వైసీపీ అధిష్టానం ఆలోచిస్తున్నట్లు పొలిటికల్ టాక్ నడుస్తోంది. మున్సిపల్ నామినేషన్ల ప్రక్రియను వీలైనంత వివాదాస్పదం చేయడం ద్వారా తమ బహిష్కరణ నిర్ణయానికి పునాది వేసుకునే ప్రయత్నం సాగుతోందని తెలుస్తోంది. నామినేషన్లలో అక్రమాలు జరిగాయంటూ హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయిం చడం, ఆరోపణలను మీడియా వేదికగా నిరంతరం పబ్లిసిటీ చేయడం ద్వారా.. ఎన్నికల యంత్రాంగం పోలీసులు కూటమికి కొమ్ముకాస్తున్నారు, ఇలాంటి వాతావరణంలో ఎన్నికలు ప్రహసనంగా మారాయి అనే అభిప్రాయాన్ని బలంగా నాటాలని యత్నిస్తున్నారు. మా అభ్యర్థుల ప్రాణాలకు రక్షణ లేదు, అందుకే మేము ఈ ప్రజాస్వామ్య రహిత ఎన్నికలను బహిష్కరిస్తున్నాం అని బాహాటంగా ప్రకటించడానికి పార్టీకి ఒక బలమైన సాకు దొరుకుతుందని భావిస్తున్నారు.తమకు ప్రజా మద్దతు ఉందని, కానీ అధికార యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతూ, నామినేషన్ పత్రాలను లాక్కోవడం, అభ్యర్థులను భౌతికంగా అడ్డుకోవడం వల్లే తాము న్యాయపోరాటం చేయాల్సి వస్తోందని వారు వాదిస్తున్నారు. సుప్రీంకోర్టు కూడా నామినేషన్ల ప్రక్రియను సమీక్షించి గడువు పెంపును పరిశీలించాలని సూచించడమే తమ ఆరోపణలకు నిదర్శనమని వారు స్పష్టం చేస్తున్నారు. స్థానిక పోరులో సాగుతున్న ఈ యుద్ధం రాబోయే రోజుల్లో మరింత ఆసక్తికరంగా మారనుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్ఈసీ , పోలీసులు ఎంతటి పటిష్ట భద్రత కల్పించినా, ఒకవేళ వైసీపీ నిజంగానే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను బహిష్కరిస్తే.. అది రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త రగడకు దారితీస్తుంది. నామినేషన్ల గడువు సమీపిస్తున్న కొద్దీ వైసీపీ వ్యూహం బహిష్కరణ వైపా లేక పూర్తిస్థాయి పోరాటం వైపా అనేది తేలిపోనుంది.



## పోలింగ్‌కు ముందే కూటమి సత్తా

-మొదటిపేజీ తరువాయి

పట్టుదలతో పని చేస్తామని ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టబోతున్న రాఘవరెడ్డి తెలిపారు. కడప నగరపాలక ఎన్నికల్లో 50 డివిజన్‌లు ఏకగ్రీవమయ్యాయి. టీడీపీ 47, బీజేపీ 2, జనసేన ఒక డివిజన్‌లో ఏకగ్రీవమయ్యాయి. మేయర్ సహా 16 డివిజన్లకు ఎన్నికలు జరగనున్నాయి. బద్వేల్ మున్సిపల్ పీఠాన్ని తెలుగుదేశం కైవసం చేసుకుంది. ఛైర్‌పర్సన్‌గా సోమేసుల దివ్యతేజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మైదుకూరు మున్సిపాలిటీ ఛైర్మన్ పీఠం టీడీపీ వశమైంది. ఛైర్మన్‌గా ధనపాల జగన్‌మోహన్ ఏకగ్రీవమయ్యారు. ఆళ్లగడ్డ మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా షేక్ అనీషా(టీడీపీ)తో పాటు 32 వార్డులను తెలుగుదేశం కైవసం చేసుకుంది. కమలాపురం నగర పంచాయతీ కూడా టీడీపీ కైవసం చేసుకుంది. ఛైర్‌పర్సన్‌గా స్వప్నతో పాటు 22 మంది టీడీపీ, ఒక బీజేపీ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజంపేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌గా తెలుగుదేశానికి చెందిన దొంతం గాయత్రి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పీఠం బీజేపీ ఖాతాలో పడింది. ఛైర్‌పర్సన్‌గా గోర్ల మధులత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 27 వార్డుల్లో కూటమి అభ్యర్థుల ఏకగ్రీవమయ్యారు. ఎర్రగుంట్లలో ఒక వార్డుకు మాత్రమే ఎన్నిక జరగనుంది. పులివెందుల మున్సిపాలిటీలో 20 వార్డులు టీడీపీ కైవసం చేసుకుంది. ఛైర్‌పర్సన్ సహా మరో 20 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి.

పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ ఛైర్మన్‌గా టీడీపీ అభ్యర్థి తంగేళ్ల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దాచేపల్లిలో ఛైర్మన్‌తో పాటు 28వార్డుల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. గురజాల నగర పంచాయతీ ఛైర్మన్‌గా తెలుగుదేశానికి చెందిన నేలవల్లి బొల్లయ్యతో పాటు 23 వార్డుల్లో కూటమి అభ్యర్థుల ఏకగ్రీవంగా గెలుపొందారు. పిడుగురాళ్ల మున్సిపాలిటీపై కూడా టీడీపీ జెండా ఎగిరింది. తెలుగుదేశానికి చెందిన బాబావలి ఛైర్మన్?గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. చిలకలూరిపేట 48 వార్డుల్లో 16 వార్డుల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవం కాగా పురపాలక ఛైర్‌పర్సన్ బరిలో ఐదుగురు అభ్యర్థులు ఉన్నారు.

ప్రకాశం జిల్లా దర్శి మున్సిపాలిటీ జనసేన కైవసం చేసుకుంది. ఛైర్‌పర్సన్‌గా దారం సుబ్బారావుతో పాటు 28 వార్డుల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కనిగిరి మున్సిపాలిటీపై టీడీపీ జెండా ఎగిరింది. ఛైర్‌పర్సన్‌గా తిరుపతమ్మతో పాటు 30 మంది కౌన్సిలర్ అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. అనంతపురం జిల్లాలోని తాడిపత్రి మున్సిపాలిటీలో 48 వార్డులకు 30 వార్డుల్లో టీడీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 37వ వార్డు కౌన్సిలర్‌గా జేసీ ప్రభాకర్‌రెడ్డి గెలుపొందారు. ఆత్మకూరు మున్సిపాలిటీని టీడీపీ కైవసం చేసుకుంది. మున్సిపల్ ఛైర్మన్‌గా గోవిందరాజులు(టీడీపీ)తో పాటు 32 వార్డులకు 27 వార్డులు ఏకగ్రీవమయ్యాయి.

అన్నమయ్య జిల్లా రాయచోటి మున్సిపాలిటీని తెలుగుదేశం కైవసం చాటింది. రాయచోటి ఛైర్మన్‌గా బోనమల ఖాదర్‌వలి(టీడీపీ)తో పాటు 44 వార్డుల్లో కూటమి అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మున్సిపాలిటీలోని నాలుగు వార్డుల్లో టీడీపీకి చెందిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2 మున్సిపాలిటీలను తెలుగుదేశం కైవసం చేసుకుంది. పుంగనూరు మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ నయామ్‌తాజ్(టీడీపీ) 32 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. నగరి మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ సహా 3 వార్డులకు ఏకగ్రీవంగా అభ్యర్థులు ఎన్నికయ్యారు. నగరి మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా శ్రీనివాసన్(టీడీపీ) విజయం సాధించారు.చిత్తూరు నగరపాలిక సంస్థ ఎన్నికల్లో 51 డివిజన్లు, కుప్పం మున్సిపాలిటీలో 13 వార్డులను తెలుగుదేశం కైవసం చేసింది.

## ఆంధ్రప్రదేశ్‌పైకి దూసుకొస్తున్న 'అర్ణబ్'

-మొదటిపేజీ తరువాయి

సమయంలో గంటకు 140 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై సహాయక చర్యలకు సిద్ధమైంది. ఈ తుపాను గత ఏడాది వచ్చిన 'మొంథా' తుపాను కంటే తీవ్రంగా ఉండొచ్చని ఏపీఎస్డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఫోన్‌లో 'ది హిందూ'తో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధతతో ఉన్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే 12 రాష్ట్ర విపత్తుల స్పందన దళం 7 జాతీయ విపత్తుల స్పందన దళం బృందాలు ఉన్నాయని, ముందుజాగ్రత్త చర్యగా మరో మూడు చీణ=ఖీ బెటాలియన్లను కేంద్రం నుంచి అభ్యర్థించినట్లు వివరించారు. తుపాను తీవ్రతకు పాత కచ్చా ఇళ్లు, చెట్లు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని, పక్కా ఇళ్లకు కూడా స్వల్ప నష్టం వాటిల్లవచ్చని ఆయన అంచనా వేశారు. బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అక్టోబర్ 27వ తేదీలోగా సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించాలని జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఈ పునరావాస కేంద్రాలలో పారిశుద్ధ్యం, నిత్యావసర సరుకుల నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తిరుపతి, నెల్లూరు జిల్లాలపై తుపాను ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఆదివారం మధ్యాహ్నానికే తూర్పు మధ్య, ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారింది. ఇది సోమవారం తెల్లవారుజామున తుపానుగా, మంగళవారానికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (×వీణ) తెలిపింది. సోమవారం శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురవొచ్చని, మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్ష తీవ్రత పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో 40 మిల్లీమీటర్ల లోపు మోస్తరు వర్షపాతం నమోదైంది. భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం, 1971 నుంచి 2026 మధ్య ఆంధ్రప్రదేశ్ తీరాన్ని 61 తుపానులు తాకగా, వాటిలో హుద్‌హుద్‌తో సహా 10 తుపానులను 'అతి తీవ్ర తుపానులు'గా వర్గీకరించారు. ఈ కేటగిరీలో చివరిసారిగా 2018లో 'తిత్లీ' తుపాను పలాస సమీపంలో తీరం దాటింది. ఇప్పటికే విశాఖ తీరంలో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. ప్రజలకు సహాయం కోసం 112, 1070, 1800 425 0101 టోల్ ఫ్రీ నంబర్లను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది.

## సరకు రవాణాలో ఏపీ పోర్టులకు దేశంలో 2వ స్థానం

-మొదటిపేజీ తరువాయి



మేజర్ పోర్టు, గంగవరం, కాకినాడ డీప్ వాటర్, కృష్ణపట్నం, కాకినాడ యాంకరేజ్, రవ్వ నాన్-మేజర్ పోర్టుల ద్వారా సరకు రవాణా సామర్థ్యం ఏటా సుమారు 327.5 ఎంఎంటీలుగా ఉంది. ఇందులో 64.12 శాతం మాత్రమే రవాణా చేయడం సాధ్యమైంది. దీన్ని మరింత పెంచాలన్నది ప్రభుత్వ లక్ష్యం. నిర్మాణంలో ఉన్న రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ పోర్టులను పూర్తి చేయడం ద్వారా దేశంలోని నాన్-మేజర్ ఓడరేవుల కార్గో సామర్థ్యంలో 20 శాతం వాటా సాధించాలని భావిస్తోంది.

**సరకు రవాణాలో 10.35% పెరుగుదల**

విశాఖపట్నం పోర్టు నుంచి 2025-26లో 91.17 ఎంఎంటీల సరకు రవాణా జరగ్గా, గత ఆర్థిక సంవత్సరంలో అది 82.62 ఎంఎంటీలుగా ఉంది. ఈ ప్రకారం సరకు రవాణాలో 10.35 శాతం పెరుగుదల నమోదైంది. ఇదే వ్యవధిలో రాష్ట్రంలోని నాన్-మేజర్ పోర్టుల ద్వారా 118.83 ఎంఎంటీల సరకు రవాణా జరిగింది. 2024-25లో ఇది 104.32 ఎంఎంటీలుగా ఉంది. గత ఏడాదితో పోలిస్తే కార్గో రవాణా 14.51 ఎంఎంటీలు పెరిగింది. నౌకల టర్న్ ఎరౌండ్ సమయం తగ్గించడం, పోర్టులో సౌకర్యాలు మెరుగు పరచడం కార్గో రవాణా పెరగడానికి కారణమని అధికారులు తెలిపారు.

**ఏటా 109 ఎంఎంటీల సరకు రవాణా**

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న నాలుగు కొత్త పోర్టులను అందుబాటులోకి తేవడం ద్వారా 2026-27లో కార్గో రవాణా సామర్థ్యాన్ని రెట్టింపు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందుకు అనుగుణంగా ఏపీ మారిటైం పాలసీని రూపొందించింది. రాష్ట్రంలోని నాన్-మేజర్ పోర్టుల మొత్తం సరకు రవాణా సామర్థ్యాన్ని ఏడాదికి 191 ఎంఎంటీల నుంచి 285 ఎంఎంటీలకు పెంచాలన్నదే పాలసీ లక్ష్యం. నాలుగు కొత్త పోర్టుల మొదటి దశ నిర్మాణం పూర్తయితే ఏటా 109 ఎంఎంటీల సరకు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుంది.

# తుఫాన్ హెచ్చరికలు నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

**కాకినాడ అక్టోబర్ 25 న్యూస్ (తెలుగు రాష్ట్రం విలేఖరి)** ఆర్నాబ్ తుఫాన్ హెచ్చరిక లు నేపథ్యంలో కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి. ఎస్ మల్లిబాబు తహసీల్దార్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 27 28వ తేదీ నాటికి తుఫాను తీవ్ర రూపం దాల్చి కాకినాడ వద్ద తీరం దాటవచ్చున్న హెచ్చరికల నేపథ్యంలో రెవెన్యూ పంచాయతీ పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి గ్రామస్థాయిలో ప్రజానీకాన్ని ఎప్పటికప్పుడు చేయాలని ముఖ్యంగా తీర ప్రాంతం మండలాలైన ఉప్పాడ, కొత్తపల్లి. కాకినాడ రూరల్. కాకినాడ అర్బన్ మరియు కరప తాళ్ళరేవు మండలాల్లో సిబ్బంది కంట్రోల్ రూమ్ ఓపెన్ చేసి నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యంగా ఈదురు గాలులకు చెట్లు విరిగిన నేపథ్యంలో అవసరమైన రంపం మిషన్లు అగ్నిమాపక సిబ్బంది వద్ద అందుబాటులో ఉంచడమైనదని. ముఖ్యంగా త్రాగునీరు ఆసుపత్రులు మొబైల్ టవర్లకు అవసరమైన చమురు నిలవలు సిద్ధం చేసుకోవాలని, మండలాల్లో గల ప్రభుత్వ స్కూళ్లను తమ ఆధీనంలోకి తీసుకోవాలని ఆదేశించారు. ఆహారం. త్రాగునీరు విద్యుత్ సౌకర్యాలకు ఆటంకం లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు ఎటువంటి విపత్కర పరిస్థితి నైనా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.



# చిగురుమామిడి లో ఘనంగా కళాకారుల దినోత్సవం...





## రాజ్ కుమార్ ఆధ్వర్యంలో సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు...

**చిగురుమామిడి అక్టోబర్ 25(మీ వార్త విలేకరి):** మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద ప్రపంచ కళాకారుల దినోత్సవం చిగురుమామిడి మండల కళాకారుల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు ఈ కార్యక్రమంలో సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి టెంకాయ కొట్టి మిఠాయిలు తినిపించుకొని ప్రత్యేక పూజలు చేసి భజన పాటలు పాడారు ఇందులో చిగురుమామిడి కళాకారుల మండల అధ్యక్షుడు శ్రీ రామోజు రాజ్ కుమార్ మాట్లాడుతూ కళాకారులు ఎలాంటి లాభాపేక్ష లేకుండా సమాజ మునగడ కోసం మంచి చెడులు,ధర్మ ఆధర్మలు, సంస్కృతి సంప్రదాయాలు మంచి విషయాలపై అవగాహన గత చరిత్ర ఆనవాళ్లు భవిష్యత్తు కార్యచరణల గురించి వేష భూషణాలతో కళ్ళకు కట్టినట్టు చూపెడుతూ పద్య,గద్యాలతో వారి పాటలతో అందరినీ మైమరిపించి ఉన్నది ఉన్నట్టు ప్రజలందరికీ తెలిపే ఈ కళాకారులు కడు దయనీయ పరిస్థితులలో ఉన్నారు చాలామంది కళాకారులు నిర్దిష్టమైన పనులు లేకుండా కళల వెంబడి తిరుగుకుంటూ వాళ్ల జీవనోపాది లేకుండా ఎంతో ఇబ్బందుల పాలవుతున్నారు కాబట్టి కళాకారులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు పూర్తిస్థాయిలో ఇవ్వాలని అర్హులైన కళాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి తద్వారా ప్రభుత్వ పథకాల ప్రోత్సాహకం కొరకు వారిని వాడుకోవాలని అలాగే 50 సంవత్సరాలు దాటిన కళాకారులకు 5000 రూపాయల పింఛను ఇవ్వాలని ప్రతి మండల కేంద్రంలో ఆయా కళాకారుల కమిటీలకు భూషణాల సంబంధించిన కిట్టు మరియు వాయిద్య పరికరాలు అలగే సౌండ్ సిస్టం అందించాలని దాని ద్వారా కళాకారులు ఇంకా ఎక్కువ కార్యక్రమాలు చేసే వీలుంటుంది కాబట్టి ఈ వసతులు కల్పిస్తూ ఇందిరమ్మ ఇళ్లను మరియు వ్యక్తిగత రుణాలను కళాకారులకు ప్రత్యేకంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజకుమార్ తో పాటు ఉపాధ్యక్షుడు మూసాపూరి సంపత్ సంయుక్త కార్యదర్శి కుతాడి కొమురయ్య గౌరవ సలహాదారు నిలుగొండ కిషన్ సహాయ కార్యదర్శి మొగిలి బొందయ్య, మల్లం బాలయ్య కళాకారులు అనువోజు ఇంద్రయ్య, శ్రీరామోజు రాములు, బాలయ్య, పత్తం రాజమల్లు, మద్రి చంద్రయ్య, పోలోజు రమేష్, మినుగుల వెంకటి, పెనుకుల వెంకటి,మినుగుల శ్రీనివాస్, పూల శ్రీనివాసరెడ్డి, కుమారస్వామి, కాశివేణి ఐలయ్య, పోగకుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# నిస్వార్ధ సేవతో ప్రజా శ్రేయస్సు కు పాటుపడతా

గూడెం జడ్పిటిసి అభ్యర్థి నేకూరి కిరణ్ కుమార్ తాడేపల్లిగూడెం జడ్పిటిసి అభ్యర్థిగా తనను గెలిపిస్తే నిస్వార్ధ సేవతో ప్రజా శ్రేయస్సుకు పాటుపడతానని తాడేపల్లిగూడెం జడ్పిటిసి (టీడీపీ) కూటమి అభ్యర్థి నేకూరి కిరణ్ కుమార్ అన్నారు. కడియద్ద మాజీ సర్పంచ్, తాడేపల్లిగూడెం మండలం జడ్పిటిసి కూటమి అభ్యర్థి నేకూరి కిరణ్ కుమార్ తన ఎన్నికల ప్రచారాన్ని మండలంలోని నందమూరి గ్రామం నుంచి ఆదివారం ప్రారంభించారు. తొలుత గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఓటమి నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి వారి మద్దతును కోరారు. వారంతా కిరణ్ కు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సౌమ్యుడిగా అందరినీ కలుపుకొని వెళ్లే స్వభావం కలిగిన కిరణ్ ను అభ్యర్థిగా ఎంపిక చేయడం పార్టీ విజయానికి తొలిమెట్టుగా వారు అభివర్ణించారు. అభ్యర్థి కిరణ్ కుమార్ మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఏపీ కార్మిక బోర్డు చైర్మన్ వలవల బాబ్జి ల ఆశీస్సులతో కూటమి అభ్యర్థిగా ప్రజల ముందుకు వస్తున్నానన్నారు. కూటమి నాయకులందరినీ కలుపుకుంటూ ప్రజా శ్రేయస్సుకై పాటుపడతానన్నారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. సామాన్యుడినైనా తనకు జడ్పిటిసి అభ్యర్థిగా అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు అన్నారు. ఈ కార్యక్రమంలో మద్దిపాటి సత్యనారాయణ, పాలడుగుల లక్ష్మణ్, పమిడి భానుచందర్, పరిమి వెంకటేశ్వరరావు ( భూపయ్య ), దారపురెడ్డి దుర్గారావు, పాకనాటి తాతాజీ, పరిమి కిరణ్, పాకనాటి సత్యనారాయణ,టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



# పాలకొల్లులో రన్నర్స్ ఆధ్వర్యంలో ఘనంగా 3కి, 5కి, 10కి రన్.





## రన్నర్స్ ఆధ్వర్యంలో పాల్గొన్న నిమ్మల రామానాయుడు

**పాలకొల్లు అక్టోబర్ 25 మీ వార్త జిల్లా ప్రతినిధి.** పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు లో తెల్లవారుజామున వేలాదిమందితో కలిసి, రన్‌లో పాల్గొన్న మంత్రి నిమ్మల రామానాయుడు. రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న యువత, వృద్ధులు, మహిళలు, చిన్నారులు. స్వచ్ఛందంగా తరలివచ్చి రన్‌ను విజయవంతం చేసిన వేలాదిమంది ప్రజలు.

ఆరోగ్యకరమైన జీవనశైలికి పరుగును అలవాటుగా చేసుకోవాలనే సందేశంతో క్రీడాస్ఫూర్తిని చాటిన రన్నర్లు. ఆరోగ్య పరిరక్షణ, శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసంపై అవగాహన కల్పించిన రన్ కార్యక్రమం. ప్రతి ఒక్కరూ ఈ రన్‌ను స్ఫూర్తిగా తీసుకొని, 365 రోజులూ నడకను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి -- మంత్రి నిమ్మల క్రమం తప్పకుండా నడవడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యల ముప్పును తగ్గించుకోవచ్చు. నడకతో శారీరక ఆరోగ్యంతో పాటు, మానసిక ఉల్లాసం, ఒత్తిడి తగ్గుతాయి. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి వ్యాయామం, నడక ఎంతో అవసరం. ప్రతిరోజూ నడుద్దాం, ఆరోగ్యంగా జీవిద్దాం, ఉల్లాసంగా గడుపుదాం.

## ఘనంగా జనసేన నాయకుడు యర్రంశెట్టి సతీష్ జన్మదిన వేడుకలు



**అమలాపురం, మీ వార్త ప్రతినిధి, అక్టోబర్,25** అమలాపురం లో జనసేన నాయకుడు యర్రంశెట్టి సతీష్ జన్మదినం సందర్భంగా లింగోలు పండు కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లింగోలు పండుతో పాటు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పరమట చిట్టిబాబు, ఏ. వేమవరపాడు మాజీ ఉపసర్పంచ్ వాకపల్లి వెంకటేశ్వరరావు, హనుమాన్ బుజ్జి, నిమ్మకాయల రాజేష్, దాసం శంకర, జయకృష్ణ, దాసం మామాజీ, తిక్కా బుజ్జి, డెక్కల రాజేష్, కాశిన సాయి, డెక్కల రాజు తదితరులు పాల్గొని యర్రంశెట్టి సతీష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## దొద్దుల వారి వాణీల వేడుకల కార్యక్రమంలో పాల్గొన్న కూటమి నాయకులు



**టి. నర్సాపురం, అక్టోబర్ 25 ( మీ వార్త విలేఖరి ):** మండల పరిధిలోని గండిగూడెం గ్రామంలో మాజీ ఎస్ ఎమ్ సి చైర్మన్ దొద్దుల రాంబాబు స్వగృహం వద్ద జరిగిన వాణీల వేడుకల కార్యక్రమం లో కూటమి నాయకులు పాల్గొని ఇద్దరి చిన్నారులను ఆశీర్వాదించారు. అనంతరం కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ప్రేమ విందులో పాల్గొన్నారు. ఈ ?కార్యక్రమంలో ?టిడిపి సీనియర్ నాయకులు శీలం వెంకటేశ్వరరావు ?జనసేన సీనియర్ నాయకులు సి. హెచ్. నవీన్ ?సొసైటీ చైర్‌పర్సన్ జోనుబోయిన సోంబాబు టీడీపీ జిల్లా కార్యదర్శి గుమ్మళ్ల నాగార్జున ?పోలవరం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బచ్చుల వెంకటేశ్వరరావు ? టి ఎన్ ఎస్ ఎఫ్ అధ్యక్షులు చిలక ఏసుబాబు (సుబ్బు తారక్) ?ముత్యాలమ్మపేట జనసేన నాయకులు పబ్బు జయరాజు ?నాయకులు కిలారు సాంబశివరావు ,రాచబంటు వేములయ్య గారు ఆళ్ళ వెంకట్ , కొక్కొండ ఈశ్వరచారి, వనపర్తి చక్రి, నరపాము దుర్గరావు , చింతం వెంకటేశ్వరావు , జోనుబోయిన రాంబాబు , జోనుబోయిన శ్రీను ?జనసేన యూత్ లీడర్ పింగుల మధు తో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

## ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాలు

### ఎంపీటీసీ అభ్యర్థిని ఖండవల్లి సుబ్బలక్ష్మి



**తాడేపల్లిగూడెం అక్టోబర్ 25 (మీ వార్త ప్రతినిధి)** నిస్వార్ధంగా ప్రజలకు సేవలు చేసేందుకే తాను రాజకీయాలలోనికి వచ్చానని తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేట ఎంపీటీసీ (జనసేన) కూటమి అభ్యర్థిని ఖండవల్లి సుబ్బలక్ష్మి అన్నారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. తనకు ఎంపీటీసీ అభ్యర్థినిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కు కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనను ఎంపీటీసీగా గెలిపిస్తే ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గతంలో తన స్వగ్రామమైన అప్పారావుపేటలో ఐదవ వార్డ్ మెంబర్ గా ప్రజల మన్ననలతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యానని తెలిపారు. గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి తనను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.

## లఘు చిత్ర పోటీలలో తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల విజయకేతనం.



**పాయకరావుపేట, మీ వార్త ప్రతినిధి**, తుని, అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భముగా "లింగ వివక్షను నివారించండి ఆడ బిడ్డను సంరక్షించండి." అనే నినాదంతో జిల్లా వైద్య శాఖ నిర్వహించిన జిల్లా స్థాయి లఘు చిత్ర పోటీలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల తుని విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ చూపించి ప్రథమ ద్వితీయ బహుమతులు కైవసం చేసుకొని విజయకేతనం ఎగురవేశారు. శనివారం కాకినాడ జిల్లా కలెక్టర్ హరిదేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా ప్రథమ ద్వితీయ బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు మొదటి బహుమతి గా 30 వేలు, ద్వితీయ బహుమతి 20వేలు నగదు బహుమతులు తో పాటు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భముగా ప్రిన్సిపాల్ డాక్టర్.సి. హెచ్.లలిత, ఉమెన్ ఎంపవర్ మెంట్ సెల్ కన్వీనర్ శ్రీమతి అలీన, శ్రీమతి సరిత విజేతలైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దివాకర్. ఎమ్.శ్రీనివాస్ అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## గొర్ల వారి పుట్టినరోజు వేడుకల్లో రుద్విక్ ను ఆశీర్వదించిన ఎమ్మెల్యే అంజిబాబు





**భీమవరం : అక్టోబర్ 25 మీ వార్త జిల్లా ప్రతినిధి.** అనాకోడరు గ్రామంలో గొర్ల నాగరాజు మనవడు రుద్విక్ మొదటి పుట్టినరోజు వేడుకలలో ఆదివారం రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) పాల్గొని రుద్విక్ కు ఆశీర్వాదాలు అందించి అక్షింతలు వేశారు. రుద్విక్ మొదటి పుట్టినరోజు సందర్భంగా 100 మంది మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. రుద్విక్ ఇటువంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాక్షించారు.

## తాడేపల్లిగూడెంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నెలవారీ సమావేశం



**తాడేపల్లిగూడెం అక్టోబర్ 25 (మీ వార్త ప్రతినిధి)** మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నెలవారీ సమావేశం ఆదివారం స్థానిక కడకట్ల సాయిబాబా గుడి ఆవరణలో జరిగింది. ఈ సమావేశంలో అక్టోబర్ నెలలో చేపట్టిన సేవా కార్యక్రమాలు, ఆర్థిక, నైతిక సహకారాల గురించి చర్చించారు. సభ్యులంతా తమ అమూల్యమైన సలహాలు, సూచనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వాసవి జీఎంఆర్ కళాశాలలో జూనియర్ ఎంపీసీ చదువుతున్న యు. సత్యసాయి అనే విద్యార్థినికి చదువు నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు. అనంతరం సంస్థ గౌరవ సభ్యులు లచ్చిరెడ్డి సత్యనారాయణ కాలు నరం సమస్యతో ఇబ్బంది పడుతున్నారని తెలుసుకుని, సభ్యులంతా ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మానవతా చైర్ పర్సన్ పైడికొండల సింధు, అధ్యక్షులు కర్రి రాజారావు, చేకూరి బంగార్రాజు, ఊడిమూడి శ్రీనివాసరాజు, బురిడీ సతీష్, ఎగ్గిన శరత్ బాబు, కె.వి. రామారావు, యర్రా ఆంజనేయస్వామి, బి.జె. ప్రసాద్, బి. హరికుమార్, ఓలేటి పాండురంగారావు, కేకే రెడ్డి, మిరియాల కిషోర్, పూతినీడి నాగరాజు, జక్కిలింకీ రామకృష్ణ, మడమల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్ర తెలంగాణ బోర్డర్ చెక్ పోస్ట్ ను సందర్శించిన ఎక్సైజ్ సూపర్నెంట్ ఆవులయ్య.






**జీలుగుమిల్లి. (మీ వార్త ప్రతినిధి)** తాటి ఆకులగూడెంలోని ఆంధ్ర తెలంగాణ బోర్డర్ చెక్ పోస్ట్ ను ఏలూరు ఎక్సైజ్ సూపర్ డెంటెంట్ అనాల ఆవులయ్య ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రభావితం చేసే అక్రమ మద్యం నాటు సారా సుంకం చెల్లించని ఇతర రాష్ట్రాల మద్యంపై ప్రత్యేక నిఘ ఉంచాలని సిబ్బందికి సూచనలు చేసినట్లు ఆయన తెలిపారు. పాత నేరస్తులను బైండోవర్లు చేయాలని సిబ్బందికి తెలిపారు. మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. సిబ్బంది వాహనాలను విధిగా తనిఖీలు చేయాలని సూచించారు. ఎవరైనా అక్రమ మద్యం సరఫరా చేసినట్లయితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ కె శ్రీను బాబు. ఎస్సై సుబ్రహ్మణ్యం. ట్రైనీ ఎస్సై ఎల్ దుర్గా శ్రావణి. ఎస్సై షేక్ బాజీ షాహిద్. ఎస్ ఎస్ టి టీమ్ ఇన్చార్జి సిహెచ్ రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## మచిలీపట్నంలో శుభకార్యానికి హాజరైన "రాధా రంగ మిత్రమండలి ప్రధాన కార్యదర్శి శేఖర్"



**మచిలీపట్నం అక్టోబర్ 25(మీ వార్త ప్రతినిధి)** మచిలీపట్నం: రాధా రంగ మిత్రమండలి ప్రధాన కార్యదర్శి పద్మనాభుని నరసింహమూర్తి (శేఖర్) మచిలీపట్నంలో నిర్వహించిన ఓ శుభకార్యానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వేడుకలో పాల్గొని కుటుంబ సభ్యులతో కలిసి ఫొటో దిగారు.

## కూటమి ఎంపీపీ అభ్యర్థి బొల్లా రాజేష్, ఐదుగుల్లపల్లి ఎంపీటీసీ అభ్యర్థి పృద్వి బాల శ్రీనివాసరావుతో ప్రచారం



**గూడూరు అక్టోబర్ 25(మీ వార్త ప్రతినిధి)** గూడూరు మండలం, రామన్నపేట లో కూటమి ఎంపీపీ అభ్యర్థి బొల్లా రాజేష్ ఐదుగుల్లపల్లి ఎంపీటీసీ అభ్యర్థి పృద్వి బాల శ్రీనివాసరావుతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు, ఈ సందర్భంగా గూడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గోపి నాగబాబు మాట్లాడుతూ జడ్పీటిసి అభ్యర్థిగా చోడగం నాంచారమ్మ గారికి, అలాగే ఎంపీటీసీ అభ్యర్థిగా పృథ్వి బాల శ్రీనివాసరావు గారికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు, ఈ ప్రచార కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి తోట వేణు,. చోడగం శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు మూరాల ధనుష్, పోతుల రాము, ఎన్ ఏ బేగ్, గొరిపర్తి చంద్రశేఖర్, లుక్కా ఏలేష్, యాదవ రెడ్డి ఆంజనేయులు, మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు,

## అత్యధిక మెజారిటీతో గెలిపించండి.

### జడ్పీటిసి అభ్యర్థి కుంజా నాగమణి .



**జీలుగుమిల్లి.( మీ వార్త ప్రతినిధి)** జీలుగుమిల్లి మండల కూటమి జెడ్పీటిసి అభ్యర్థి కుంజా నాగమణి మండలంలోని గ్రామాలలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి నాయకులతో కలిసి పలు గ్రామాలలో ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. మండలాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని ఆమె తెలిపారు. మండల ప్రజలు తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. మండలాన్ని మెరుగైన మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని ఆమె అన్నారు. కూటమి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందిస్తామని అన్నారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో ముందు ఉంచుతానని అన్నారు. తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కూటమి నాయకులను కార్యకర్తలను మండల ప్రజలను కోరారు.

## నరసాపురం పట్టణంలోని పలు చర్చిలను దర్శించిన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, కొత్తపల్లి జానకిరామ్







**నరసాపురం అక్టోబర్ 25 మీ వార్త జిల్లా ప్రతినిధి.** నరసాపురం పట్టణంలోని పలు చర్చిలను రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ సందర్శించారు. ఆయనతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిని శ్రీమతి కొత్తపల్లి శైలజ, ఇతర కౌన్సిలర్ అభ్యర్థులు చర్చిలలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్ ఈ సందర్భంగా చర్చి పాస్టర్లు, సంఘ పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఎమ్మెల్యే శ్రీ బొమ్మిడి నాయకర్ ని, చైర్‌పర్సన్ అభ్యర్థిని శ్రీమతి కొత్తపల్లి శైలజ ను మరియు కూటమి అభ్యర్థులను ఆశీర్వదించారు. అనంతరం క్రైస్తవ సోదర సోదరీమణులను ఆత్మీయంగా పలకరించి, నరసాపురం పట్టణ సమగ్ర అభివృద్ధికి మరియు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల ఘనవిజయానికి తమ ఆశీస్సులు, సంపూర్ణ మద్దతు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు కొత్తపల్లి జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు

## పీఎం లంకలో తుఫాను రక్షిత భవనం పరిశీలన



**నరసాపురం అక్టోబర్ 25 మీ వార్త జిల్లా ప్రతినిధి.** పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం పెదమైన వానిలంకలో తుఫాను ముప్పు నేపథ్యంలో పి యం లంక గ్రామంలోని తుఫాను రక్షిత భవనాన్ని నరసాపురం ఆర్డీవో దాసరాజు తాసిల్దార్ నాగార్జున ఆదివారం పరిశీలించారు ఆశ్రయ కేంద్రంలో వసతులు భవనం ప్రతిష్టతను తనిఖీ చేసి తాగునీరు విద్యుత్ వైద్యం సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. తుఫాను నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## అంబేద్కర్ నేషనల్ అవార్డుకు బోయిని బాబు ఎంపిక...




**చిగురుమామిడి అక్టోబర్ 25 (మీ వార్త విలేకరి):** బహుజన సాహిత్య అకాడమీ ఢిల్లీలో ప్రదానం చేసే డా. అంబేద్కర్ జాతీయ అవార్డుకు బోయిని బాబును ఎంపిక చేసామని ఆ సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ తెలిపారు. ఆదివారం నాడు హైదరాబాదులోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో ఆయన ఎంపిక పత్రాన్ని బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ చిరుమామిడి మండలం నవాబుపేట గ్రామానికి చెందిన బోయిని బాబు గత రెండు దశాబ్దాలుగా అటు బహుజన సమాజ్ పార్టీలో ఇటు దళిత సంఘాలలో పనిచేస్తూ అంబేద్కర్ సిద్ధాంతాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నాడని అన్నారు. దళిత, బహుజన ప్రజల అభివృద్ధి కోసం, విద్యార్థుల భవిష్యత్తు కోసం పలు కార్యక్రమాలు చేపట్టాడని కొనియాడారు. వారి సేవానిరతిని గుర్తించి ఈ అవార్డుకి ఎంపిక చేశామన్నారు. నవంబర్ 15న ఢిల్లీలో జరిగే 20వ జాతీయ సదస్సు సందర్భంగా బాబుకు ఈ అవార్డును ప్రదానం చేస్తామని తెలిపారు. కాగా తనకు అవార్డు రావడం పట్ల బాబు హర్షం వ్యక్తం చేస్తూ, అవార్డు ఎంపికకి సహకరించిన బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర కమిటీ సభ్యులు ముక్కెర సంపత్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్రంలోని మున్సిపల్, కార్పొరేషన్ డపంచాయతీలలో ఎస్సీ ఎస్టీ లకు రిజర్వేషన్ లు అమలు చేయాలి

### కృష్ణా జిల్లా విశ్వ హిందూ పరిషత్ అధ్వర్యంలో



**మచిలీపట్నం అక్టోబర్ 25(మీ వార్త ప్రతినిధి)** ఎస్సీఎస్టీ.లకు రిజర్వేషన్లు కేటాయించిన రాష్ట్రంలోని అన్ని మున్సిపల్, కార్పొరేషన్ మరియు పంచాయతీలలో నిజమైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కాకుండా క్రైస్తవులకు(బి సి, సి)లకు రాజకీయ పార్టీలు సీట్లు కేటించటం రాజ్యాంగ విరుద్ధమైన చర్య, కాబట్టి అట్టి వారిపై స్పెషల్ ఎంక్వైరీ వేసి అభ్యర్థుల స్థితి గతులను మరియు సర్టిఫికెట్లను పరిశీలించి సుప్రీంకోర్టు తీర్పులను పరిగణలోకి తీసుకొని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ స్టేట్ ఎలక్షన్ కమిషనర్ గారికి(ఎస్ ఈ సి) కి విశ్వ హిందూ పరిషత్(వి హెచ్ పి) విజయవాడ మహానగర్ ఆధ్వర్యంలో వి హెచ్ పి కార్యదర్శి పొట్టి శ్రీహరి జీ,సహా కార్యదర్శి కొంపెల్లి శ్రీనివాస్ మరియు ఏపీ రెల్లి సంక్షేమ కులాల సంఘం ఎన్ టి ఆర్ జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి విశ్వేశ్వరరావు కలిసి ఈ రోజు సాయంత్రం వినతి పత్రం ఇవ్వటంజరిగింది. భారతరాజ్యాంగాన్ని పరిరక్షించాలి

## వంతాల, బంగారు మెట్ట రహదారి పనులు పూర్తయ్యేది ఎప్పుడు





**జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి):** జి మాడుగుల మండలం వంతాల పంచాయితీ నుండి బంగారుమెట్ట కు వెళ్లే ప్రధాన రహదారి పనులలో పూర్తి కావలసిన కల్వర్టు పనులు పూర్తి చేయకపోవడం. గుత్తేదారు నిర్లక్ష్యంతో అసంపూర్తిగా నిలిచిపోవడంతో, ఇదే ప్రధాన రహదారి మీదుగా వెళ్లే పలు గ్రామాల ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తూ ప్రయాణం సాగించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రహదారి పనులు పూర్తి అయితే వంతాల, పెదలోచలి, సొలబం ,గడుతురు, పంచాయతీలకు రహదారి సౌకర్యం మెరుగు పడడంతో పాటు జిల్లా కేంద్రమైన పాడేరుకు అతి దగ్గర రహదారి సౌకర్యం కలుగుతుందని, పలు పంచాయతీల ప్రజలు కోరుతున్నారు. ఈ రహదారి నిర్మాణం పై పలుమార్లు అధికారులకు విన్నవించుకున్న అధికారలనుంచి సరైన స్పందన రాకపోవడంతో, గుత్తేదారుడు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అసంపూర్తి గా పనులు చేస్తూ. కల్వర్టు పనులు పూర్తి చేయకుండా ఆసంపూర్తిగా వదిలేశాడనీ, దీనివల్ల రహదారి పనులు కూడా పూర్తి కావడం లేదని పలు పంచాయతీ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఈ రహదారి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు..

## - పెదవేగిలో చింతమనేని నవ్యశ్రీ ఎన్నికల ప్రచార భేరీ -

## కన్నాపురం గ్రామం నుంచి తొలి అడుగు వేసిన జెడ్పీటీసీ కూటమి అభ్యర్థి చింతమనేని సాయి నవ్యశ్రీ.



ఇంటింటా ఆత్మీయ స్వాగతం - తమ ఇంటి బిడ్డలా నవ్యశ్రీకి మంగళహారతులు పట్టి, దిష్టి తీసి ఆశీర్వదించిన గ్రామ మహిళలు.
గడప గడపకూ కూటమి ప్రచారం - జెడ్పీటీసీ స్థానంతో పాటు స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థులందరినీ గెలిపించాలని నవ్యశ్రీ విజ్ఞప్తి.
తండ్రి బాటలోనే ప్రజాసేవ - ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై ఉన్న అపార ప్రేమాభిమానాలను నవ్యశ్రీపై చూపించిన ప్రజలు.
మొదటి రోజే అదిరిపోయిన జోష్ - కన్నాపురంలో అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన జనం.. విజయతీరాల వైపు తొలి అడుగు.
పెదవేగి:
"ఏలూరు జిల్లా పెదవేగి జెడ్పీటీసీ కూటమి అభ్యర్థిగా చింతమనేని సాయి నవ్యశ్రీ ఆదివారం సాయంత్రం తన ఎన్నికల ప్రచార శంఖారావాన్ని ఘనంగా పూరించారు. పెదవేగి మండలం కన్నాపురం గ్రామం నుంచి తన ఎన్నికల ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించిన ఆమె.. గ్రామంలోని ప్రతి గడపకూ తిరుగుతూ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. పెదవేగి జెడ్పీటీసీగా తనను భారీ మెజారిటీతో గెలిపించడంతో పాటు, అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులందరినీ ఏకపక్షంగా ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా తమ అభిమాన నాయకుడు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తె నవ్యశ్రీకి కన్నాపురం గ్రామ ప్రజలు, మహిళలు అపూర్వ రీతిలో బ్రహ్మరథం పట్టారు. ప్రతి ఇంటా తమ సొంత బిడ్డనే ఆహ్వానించినట్లు ఎంతో ఆప్యాయంగా స్వాగతం పలుకుతూ.. మంగళహారతులు పట్టి, నుదుట కుంకుమ దిద్ది సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రజలు చూపించిన అంతులేని వాత్సల్యంతో తొలిరోజే ప్రచార పర్వం ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దెందులూరు ఏఎంసీ మార్కెట్ చైర్పర్సన్ గారపాటి రామసీత మండల పార్టీ అధ్యక్షులు ఈడుపుగంటి అనిల్ సహా పలువురు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు."

# పెడన మండలం కొంకేపూడి
# ఎం పి టి సి అభ్యర్థిగా కట్టా నాగ తిరుమల

**పెడన అక్టోబర్ 25(మీ వార్త ప్రతినిధి)** పెడన మండలం : స్థానిక సంస్థల ఎన్నికల్లో పెడన మండల ఎంపీటి సి అభ్యర్థిగా కూటమి తరఫున కట్టా నాగ తిరుమల ఎంపిక చేసినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు శలపాటి ప్రసాద్ తెలిపారు . ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆదే శాల మేరకు ప్రతి ఒక్కరు వారి ఓటు హక్కును సైకిల్ గుర్తుపై వేసి గెలిపించ ప్రార్థన పెడన లోని పార్టీ కార్యాలయం నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి తెలుగుదేశం మండల అధ్యక్షులు సేలపాటి వీరప్రసాద్, ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాద్ మరియు పెడన మండలంలోని ఆయా గ్రామాల తెలుగు కూటమి అధ్యక్షులు కార్యదర్శులు పాల్గొని డోర్ టు డోర్ క్యాంపెన్లో పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా నిలిచి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కూటమి అభ్యర్థిగా కొంకేపూడి ఎంపీటీసీ కట్టా నాగ తిరుమల ఎంపికైన నేపథ్యంలో కార్యక్రమాన్ని సమష్టిగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పెడన మండల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ప్రజల అవసరాలను గుర్తించి, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. మండల టిడిపి నాయకులు శాలపాటి వీర ప్రసాద్ నాయకత్వంలో మండలంలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి అంశాలకు ప్రాధాన్యమివ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు.



# మీ ఆడ బిడ్డను ఆశీర్వదించండి







## త్రాగునీరు, ఇళ్ల స్థలాల సమస్యల పరిష్కారమే నా ధ్యేయం

## ఎంపీటీసీ అభ్యర్థిని కసిరెడ్డి మధులత

**పెంటపాడు అక్టోబర్ 25 (మీ వార్త ప్రతినిధి)** ప్రజలే నా బలం ప్రజాసేవే నా కర్తవ్యం అని,పెంటపాడు ప్రధాన సమస్యలైన త్రాగునీరు, ఇళ్ల స్థలాల సమస్యలకు పరిష్కారం చేయడమే తన ప్రధమ కర్తవ్యం అని వెలమపేట ముద్దుబిడ్డ, ఎంపీటీసీ -2 అభ్యర్థి కసిరెడ్డి మధులత అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా ఆదివారం పెంటపాడు లోని ఎంపీటీసీ -2 వార్డులో ఆమె ప్రజలతో మమేకమై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధులత మాట్లాడుతూ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆశీస్సులతో ఎంపీటీసీగా కూటమి నాయకుల సహకారంతో తాను పోటీ చేస్తున్నానని ప్రజా ఆశీర్వాదం కొరకై మీ ముందుకు వస్తున్నానన్నారు. తాను మీలో ఒకరిని మాత్రమే అని, మీరే నా బలం, నా గెలుపే మీ గెలుపు అని భావోద్వేగంగా మాట్లాడారు. రానున్న ఎన్నికలలో ఎంపీటీసీ అభ్యర్థిగా తనకు గాజు గ్లాస్ గుర్తుపై, జడ్పీటిసి అభ్యర్థిగా తనబుద్ధి రవికిరణ్ కు కూడా గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి తమ ఇద్దరిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. పెంటపాడు లోని ప్రధాన సమస్యలైనా త్రాగునీరు, డ్రైన్, లో-వోల్టేజ్ విద్యుత్ సమస్య, ఎన్నాళ్ళ నుంచో ఎదురుచూస్తున్న ఇల్లా స్థలాల సమస్యను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వాటితోపాటు ఏ సమస్యనైనా పరిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ముక్తకంఠంతో చెప్పారు. పార్టీలకు అతీతంగా, కుల మతాలకు సంబంధం లేకుండా ప్రతి ఒక్కరి సమస్యను తీర్చేందుకు తన సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి అప్పన్న, కిలపర్తి వెంకట్రావు, మైలవరపు రాజేంద్రప్రసాద్, కొనకల్ల హరినాథ్, జామి ప్రవీణ్ కుమార్, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, చామన సురేష్, నక్కా సాంబశివరావు, జీవీ. ప్రసాద్, కసిరెడ్డి పెద్దిలు కసిరెడ్డి శ్రీలక్ష్మి, నక్కా సత్యవతి, సిరాపరపు లక్ష్మి, రెడ్డి సత్యవతి, జామి సింధు, నల్లమిల్లి ఇంద్రాణి, చెన్నంశెట్టి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పెడన మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా కూటమి ప్రభుత్వం బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థి కి గెలిపించండి

### వీర్నాల ఫౌండేషన్ "ఫౌండర్ వీర్నాల బాలాజీ" మద్దతు



**పెడన అక్టోబర్ 25(మీ వార్త ప్రతినిధి)** పెడన మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా కూటమి ప్రభుత్వం బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థి శ్రీమతి బళ్ళ జ్ఞాన లింగ నాగ జ్యోస్నా రాణి ప్రచారం కార్యక్రమంలో పెడన లో వీర్నాల ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు. జనసేన, ఇతర కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా డోర్ టూ డోర్ కాంపెయిన్ లో భాగముగా వీర్నాల ఫౌండేషన్ ఫౌండర్ వీర్నాల బాలాజీ సత్కారం చేసిన పెడన మున్సిప ల్ చైర్ పర్సన్ జనసేన అభ్యర్థి బల్ల జ్ఞాన లింగ జ్యోత్నారాణి,కూటమి పార్టీల సమన్వయంతో పెడన పట్టణ అభివృద్ధికి మరింత ముందడుగు పడాలని ఆకాంక్షిస్తూ, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి శ్రీమతి బళ్ళ జ్ఞాన లింగ నాగ జ్యోస్నా రాణి అత్యధిక మెజార్టీ సాధించాలని కోరుతూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసారు..

## ధర్మాజీ గూడెంలో జోరుగా టీడీపీ ఎన్నికల ప్రచారం





**లింగపాలెం, అక్టోబర్ 25 ( మీ వార్త విలేఖరి ):**.మండల పరిధిలోని ధర్మాజీ గూడెం ఎంపీటీసీ-2 బరిలో నిలిచిన ఆతుకూరి ప్రియాంక ఇంటింటికీ తిరుగుతూ "అభివృద్ధి -- ప్రజాస్వామ్య పాలనే లక్ష్యం"గా ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. గ్రామ ప్రజల నుంచి లభిస్తున్న భారీ మద్దతుతో ప్రచారం నిర్వహిస్తున్నారు.
ఎంపీటీసీ-2 స్థానంలోదూసుకెళ్తున్న ఆతుకూరి ప్రియాంక ప్రచారం "అభివృద్ధికి ఓటేయండి.. ప్రజాస్వామ్యాన్ని గెలిపించండి" అంటూ ఇంటింటికీ ఆతుకూరి ప్రియాంక అబ్యర్ధించారు తెలుగుదేశం పార్టీ శ్రేణులు, మద్దతుదారుల కోలాహలం మధ్య ధర్మాజీ గూడెం వీధులన్నీ పసుపు వర్ణమయంగా మారాయి. ప్రచారంలో భాగంగా ప్రియాంక స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, గ్రామంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను పరుగులు తీర్చే బాధ్యత తనదేనని హామీ ఇస్తున్నారు. గ్రామ ప్రజల నుంచి ఆమెకు బ్రహ్మరథం పడుతూ, హారతులు పట్టి ఘన స్వాగతం పలుకుతుండటం టీడీపీ క్యాడర్‌లో సరికొత్త జోష్ నింపింది. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని, విజయం మనదేనంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## ఆకుతీగపాడులో వేడెక్కిన ఎన్నికల ప్రచారం



**పెంటపాడు అక్టోబర్ 25 (మీ వార్త ప్రతినిధి )** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా త్వరలో జరగబోయే జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా కూటమి అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తించడంతో ఆకుతీగపాడులో కూటమి నాయకుల జన సందోహం మధ్య ఎన్నికల ప్రచారం వేడెక్కింది. ఆకుతీగపాడు ఎంపీటీసీ అభ్యర్థినిగా కిలపర్తి లక్ష్మి వెంకట భవాని (జనసేన) కూటమి అభ్యర్థిగా ఆదివారం ప్రజల ముందుకు వెళ్లి గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా కూటమి నాయకుడు బుద్ధ ధనరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆశీస్సులతో లక్ష్మీ భవాని కూటమి అభ్యర్థిగా ప్రజల ముందుకు వస్తున్నారని, గ్రామాభివృద్ధి కొరకు ప్రజలంతా లక్ష్మీ భవానికి, మరియు జడ్పిటిసి అభ్యర్థి తన బుద్ధి రవి కిరణ్ కు గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి వారిని గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కొణతాల వెంకట్రావు, దాసం వెంకటేశ్వర్లు, ఆకుల నాని, మొఖమాట్ల సూరిబాబు, పడాల ఉమా శంకర్, కొల్లూరి నాగరాజు, తిరుపతి సురేష్,తిరుపతి శ్రీనివాస్, మొఖమాట్ల సాయి, దాసం నరసయ్య, మొఖమాట్ల అరుణ్ కుమార్ ఇర్లపాటి గోపి, కాసారపు ఏసు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఘన స్వాగతం



**కుకునూరు అక్టోబర్ 25 (మి వార్తా ప్రతినిధి)** మాధవరం గ్రామ పంచాయతీలో ఈరోజు టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి 30 కుటుంబాల సభ్యులు చేరడం జరిగింది. గ్రామ పంచాయతీ కన్వీనర్ గంజి శ్రీను , మండల అధ్యక్షులు తాంద్ర రాజేష్ , యూత్ అధ్యక్షులు చేకూరి నవీన్ వర్మ సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన రావులపాటి నరసింహారావు , ముదిగొండ ఖాదర్ మరియు 30 కుటుంబాల సభ్యులకు పార్టీ తరఫున హృదయపూర్వక స్వాగతం తెలియజేస్తున్నాము. ప్రజలతో మమేకమై... ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుదాం!

# కుకునూరు తెలుగుదేశం పార్టీ తరుపున ఎంపీటీసి 1 అభ్యర్థిగా పిచ్చుక రాజు

**కుకునూరు అక్టోబర్ 25 (మి వార్తా ప్రతినిధి)** ఎవరి నామస్మరణతో సమస్యలు పారిపోతాయో, ఎవరి పేరు మానవత్వానికి ప్రతీకగా నిలుస్తుందో, ఆపదలో శత్రువు సైతం నీ వెంటే నడుస్తానని ఎవరిని నమ్ముతాడో, కులమతాలకతీతంగా ఎవరితో కలిసి ముందుకు సాగుతారో - అలాంటి గొప్ప వ్యక్తి, తాను నమ్మిన సిద్ధాంతాల కోసం, పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన నాయకుడు శ్రీ పిచ్చుక రాజు. సేవే లక్ష్యంగా, ప్రేమే మార్గంగా భావించే ఆయన, కుక్కునూరు మండలంలో 108 లేని సమయంలో గర్భిణీ స్త్రీలకోసం ఉచిత ఆటో సేవలను ఏర్పాటు పేసెంట్ ను భద్రాచలం రిఫర్ చేస్తే సొంత డబ్బులతో డీజిల్ కోటించి చేసి ఎవరికీ సాధ్యంకాని సాహసం చేశారు. బిజెపి, జనసేన పార్టీల బలపరిచిన కుక్కునూరు 1 ఎంపీటీసి అభ్యర్థిగా టిడిపి తరఫున ఆయన బరిలో నిలుస్తున్నారు. ఎంపీటీసి పరిధిలోని గ్రామస్తులందరూ, ఓటర్లందరూ రాజకీయాలను పక్కనపెట్టి, మంచి వ్యక్తిత్వం, విశాల హృదయం కలిగిన ఆయనను ఆశీర్వదించాలి. ఎవరి ఇంట్లో ఏ శుభకార్యమైనా, కష్టనష్టాలొచ్చినా "నేనున్నాను" అంటూ ముందుండే నాయకుడు మన రాజన్న. మండల పార్టీ నాయకులను సమన్వయం చేస్తూ అందరినీ ఒక తాటిపైకి తెస్తున్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్యావ్యవస్థలో అడుగుపెట్టి, బడుగు బలహీన వర్గాల పిల్లలకు అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యనందిస్తూ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. పార్టీ ముఖ్య నాయకుల పుట్టినరోజులను ముందుండి మరీ జరుపుతూ, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి పాలు, పండ్లు పంపిణీ చేస్తూ, ఎవరికీ ఏ ఆపద వచ్చినా ఆపద్బాంధవుడిగా నిలుస్తున్నారు.

కుక్కునూరు 1 ఎంపీటీసి స్థానం జనరల్ అయిన తెలుగు దేశం పార్టీ గురించి వెనుకాముందు ఆలోచించకుండా ఆయన తన పేరును ముందుగానే ప్రకటించడం ఆయన ప్రజాసేవకు నిదర్శనమని అభిమానులు, కార్యకర్తలు భావిస్తున్నారు. ప్రత్యర్థి ఎంత బలవంతుడైనప్పటికీ, తాను చేసిన సేవలతో అవలీలగా విజయం సాధించగలనన్న ధీమా ఆయనది. కావున ప్రజలందరూ పార్టీలకు అతీతంగా ఆయన చేసిన



సేవలను గుర్తుంచుకుని, ఆయన ద్వారా లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి, మా అన్న పిచ్చుక రాజును అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నాము.

# దేశాన్ని కాపాడుతున్నది యువతనే!

స్టాక్ మార్కెట్‌లో రక్త కన్నీరు ఆగడం లేదు. లక్షల కోట్ల సంపద ఆవిరి అవుతున్నది. గడిచిన రెండున్నరేండ్ల నుంచి మార్కెట్ తిరోగమన దిశలో పయనిస్తున్నది. దేశంలో అప్రజాస్వామిక విధానాల పట్ల జెన్-జీ యువత ఉద్యమిస్తున్నది. నియంతృత్వం మీద పోరాటం చేసే శక్తులు ఇంకా ఉన్నాయని నిరూపించింది. దేశంలోని ప్రజాస్వామ్యాన్ని మాత్రమే కాదు చివరకు మన ఆర్థిక వ్యవస్థను బతికిస్తున్నది కూడా యువతనే. 'విదేశాల్లో అంట్లు తోమి బతుకుతున్నారు' అని యువతను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చులకన చేసి మాట్లాడినా, ప్రశ్నిస్తున్న యువతను 'దిమాగీ నక్సల్స్' అని ప్రధాని నరేంద్ర మోదీ చిన్నచూపు చూస్తున్నా దేశాన్ని ఆర్థికంగా కుంగిపోకుండా నిలబెడుతున్నది యువతనే. ప్రపంచంలో ముడి చమురు ధర 114.22 డాలర్లకు, డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ.94.93 చేరుకున్నది. పులి మీద పుట్రలా ఈ రెండు దెబ్బలు సరిపోవు అని విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రెండేండ్లలోనే రూ.5.5 లక్షల కోట్ల నిధులు మన మార్కెట్ నుంచి తరలించుకు వెళ్లారు. ఈ మూడు దెబ్బలతో మన స్టాక్ మార్కెట్ మాత్రమే కాదు, మొత్తం ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే పరిస్థితి నెలకొన్నది. ఈ స్థితి నుంచి దేశాన్ని ఆర్థికంగా రక్షిస్తున్నది యువతనే.

ప్రపంచంలో అనేక దేశాల్లో ఉద్యోగాలు చేస్తూ తమ సంపాదనను ఇండియాకు పంపిస్తున్న యువత వల్ల విదేశీ మారకద్రవ్యం నిలువలు అడుగంటకుండా గౌరవ ప్రదంగా నిలిచాయి. కరోనా తర్వాత మన దేశంలోని యువత ఉద్యోగ భద్రత లేకపోవడం, భవిష్యత్తు కోసం పొదుపు అనే ఆలోచన చేయడం మొదలు పెట్టారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) ద్వారా నెలనెలా పెద్ద మొత్తంలో యువత ఇన్వెస్ట్ చేస్తున్నారు.



విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్‌లు ఎంత వేగంగా నిధులు తీసుకువెళ్తున్నారో అంతే వేగంగా యువత సిప్ ద్వారా ఆ లోటును భర్తీ చేస్తున్నది. దేశవిదేశాల్లోని యువత ఇప్పుడు ఆదుకోకపోయి ఉంటే దేశం మరింతగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి ఉండేది. ఇలాంటి యువతకు పాలకులు 'దిమాగీ నక్సల్స్' అని పేరు పెట్టినా, అంట్లు తోమడానికి విదేశాలకు వెళ్తారు అని తిట్టినా దేశాన్ని ఇప్పుడు ఆర్థికంగా ఆదుకుంటున్నది వాళ్లే. క్రూడ్ ఆయిల్ దిగుమతి బిల్లు ఏటా 137 బిలియన్ డాలర్లు, అంటే మన రూపాయల్లో రూ.11.5 లక్షల కోట్లు.

విదేశాల్లో పని చేసే భారతీయులు ఏటా పంపే నిధులు 135.46 బిలియన్ డాలర్లు అంటే రూ.11.4 లక్షల కోట్లు. క్రూడ్ ఆయిల్ బిల్లుకు మనం చెల్లించే నిధులు, విదేశాల నుంచి మన మనవాళ్లు పంపే నిధులు దాదాపు సమానంగా ఉన్నాయి. విదేశీ మారకద్రవ్యం విషయంలో విదేశాల్లో పని చేసే మన వాళ్లు దేశానికి ఈ విధంగా అండగా నిలిచారు.

ఇక సిప్‌ల ద్వారా మన యువత 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.3.5 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేశారు. అదే సమయంలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్‌లు రూ.1.81 లక్షల కోట్లు దేశం నుంచి తరలించుకుపోయారు. నిరుడు విదేశీ పెట్టుబడిదారులు తరలించిన దాని కన్నా మన వాళ్లు సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేసింది దాదాపు రెట్టింపు. అయితే ఇది ఇప్పుడు చాలా వేగంగా రివర్స్ అవుతున్నది. ఈ సెప్టెంబర్‌లో సిప్‌ల ద్వారా రూ.32,490 కోట్ల పెట్టుబడులు వస్తే అదే నెలలో విదేశీ పెట్టుబడి దారులు రూ.44,013 కోట్లు వెనక్కి తీసుకున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఈ అంతరం చాలా వేగంగా పెరిగే అవకాశం ఉన్నది. సిప్‌ల ద్వారా ఇన్వెస్ట్ చేస్తున్నది ఎక్కువగా యువతనే. సిప్‌లపై రెండున్నరేండ్ల నుంచి ఎలాంటి లాభం లేదు. పైగా దాదాపు 25 శాతం వరకు నష్టం వచ్చింది. మార్కెట్లో పరిస్థితి ఇలానే ఉంటే క్రమంగా సిప్‌ల మీద ఆసక్తి తగ్గుతుంది.

విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు గత తొమ్మిదేండ్లలో మన దేశంలో ఎంత మొత్తం ఇన్వెస్ట్ చేశారో, కేవలం రెండేండ్లలో అంత మొత్తం వెనక్కి తీసుకున్నారు. 2015 అక్టోబర్ నుంచి 2024 అక్టోబర్ నాటికి మన మార్కెట్‌లో 63.5 బిలియన్ డాలర్‌ల పెట్టుబడులు వచ్చాయి. 2024 అక్టోబర్ నుంచి 2026 అక్టోబర్ నాటికి 63.6 బిలియన్ డాలర్‌ల పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. ఈ నెల ముగింపునకు ఇంకా వారం రోజుల గడువు ఉన్నది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల నిధుల తరలింపు ఆగడం లేదు.

ఇక్కడ కాకపోతే ఇంకెక్కడ పెట్టుబడి పెడతారు అని స్టాక్ మార్కెట్ నిపుణులు ఏడాది క్రితం ఆత్మవిశ్వాసంతో ప్రకటించేవారు. నిధుల తరలింపు ప్రవాహం ఆగకపోవడంతో ఇక్కడ కాక పోతే ఇంకెక్కడ ఇన్వెస్ట్ చేస్తారు అనేవారి మాటల్లో ఇప్పుడు ఆ ఆత్మవిశ్వాసం కనిపించడం లేదు. మన రూపాయల్లో అంటే 2026 అక్టోబర్ నాటికి రూ.5.5 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు ఉపసంహరించుకున్నారు. ఏఐ సెమీ కండక్టర్ రంగాల్లోకి నిధులు తరలి వెళ్తున్నాయని మొదట నిపుణులు అంచనా వేశారు. ఆ దేశాల్లో ఏఐ బుడగ పేలిపోయినప్పటికీ మన దేశం నుంచి నిధుల ప్రవాహం తరలివెళ్లడం ఆగలేదు. అక్కడ ఏఐ ప్రతికూల పరిస్థితుల్లో మన దేశానికి పెట్టుబడులు తరలి రావాలి. కానీ రావడం కాదు. కనీసం మన దేశం నుంచి నిధులు తరలివెళ్లడం కూడా ఆగలేదు. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు మన దేశం నుంచి నిధులు తరలించుకువెళ్లడం గురించి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విచిత్రమైన వాదన చేశారు. మన దేశ మార్కెట్ నుంచి సులభంగా నిధులు తరలించుకు వెళ్లే అవకాశం ఉన్నది కాబట్టి విదేశీ సంస్థాగత పెట్టుబడి దారులు నిధులు తలరిస్తున్నారట. దొంగతనాలు ఎందుకు జరుగుతున్నాయి అంటే 'సంపద ఉన్నది కాబట్టి దొంగతనాలు జరుగుతున్నాయి' అని సమర్థించుకున్నట్టుగా ఉన్నది. దేశంలోకి విదేశీ నిధులు రావడం అంటే దేశంలో ఉపాధి అవకాశాలు పెరుగడం. నిధులు తరలివెళ్తున్నాయి అంటే ఉపాధి అవకాశాలకు గండి పడుతున్నదని అనే అర్థం. ఈ విషయం పాలకులు గ్రహించాలి. స్టాక్ మార్కెట్‌లో రక్తపాతాన్ని అడ్డుకోవడానికి, నిధుల తరలింపునకు సరైన కారణాలను కేంద్ర ప్రభుత్వం అర్థం చేసుకోకపోతే, సమస్య పరిష్కారానికి పూనుకోక పోతే, దేశ ఆర్థిక వ్యవస్థ మరింత సంక్షోభంలో పడుతుంది.

## 4 లక్షల నుంచి 2 లక్షలకు..
## వెండి ధర ఎందుకు తగ్గుతోంది?

ఇంటర్నెట్ డెస్క్: బంగారం, వెండి ధరలు గత కొన్ని రోజులుగా విలువను కోల్పోతున్నాయి. ఇంధన ధరలు పెరుగుతుండడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, వడ్డీ రేట్ల పెంపు వంటివి ఈ రెండు లోహాలపై ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా వెండి గరిష్ఠాల నుంచి సగానికి పైగా పతనమై రూ.2 లక్షల దిగువకు చేరింది. వెండి ఈ ఏడాది జనవరిలో ఔన్సు 120 డాలర్లు పలికింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో దీని ధర అప్పట్లో రూ.4 లక్షలు దాటింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు వెండి 53 డాలర్లకు పడిపోయింది. దీంతో కిలో వెండి ధర రూ.1.9 లక్షలకు చేరింది. పశ్చిమాసియా సంక్షోభం, ముఖ్యంగా సౌదీ అరేబియాలో చోటుచేసుకుంటున్న ఇటీవలి పరిణామాల వల్ల చమురు ధరలు పెరుగుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ ప్రస్తుతం 116 డాలర్లకు చేరుకుంది. దీంతో ద్రవ్యోల్బణ భయాలు పెరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం ముప్పు వల్ల యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను దీర్ఘకాలం పాటు గరిష్ఠ స్థాయిలోనే ఉంచుతుందన్న అంచనాలు బలపడ్డాయి. దీనివల్ల అమెరికా డాలర్ బలపడి బంగారం, వెండి వంటి విలువైన లోహాలపై ఒత్తిడి పడుతోంది. మరోవైపు బంగారంతో పోలిస్తే వెండిని పారిశ్రామిక అవసరాలకు ఎక్కువగా వినియోగిస్తుంటారు. అయితే, ప్రపంచ మార్కెట్లలో ప్రతికూల పరిస్థితులు, భౌగోళిక రాజకీయ అనిశ్చితుల వల్ల ఆర్థిక వృద్ధి మందగిస్తుందన్న ఆందోళనలు వెండికి పారిశ్రామిక డిమాండ్ తగ్గింది. దీంతో వెండి ధర పతనం అవుతోంది.




# సంపాదకీయం

# జలసంరక్షణే శ్రీరామరక్ష

నీటిబొట్టును నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఎడారే.. ప్రజల బాధ్యతతో పాటు ప్రభుత్వాల చిత్తశుద్ధి అవసరం! ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పు లు తీవ్ర సవాళ్లను విసురుతున్నాయి. ఇందులో ప్రధానంగా భారత్ లాంటి వ్యవసాయ ఆధారిత దేశాలను వణికిస్తున్న అతిపెద్ద సమస్య 'ఎల్‌నినో'. పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడం వల్ల ఏర్పడే ఈ పరిస్థితి.. మన దేశంలో రుతుపవనాల గమనాన్ని దెబ్బతీసి, తీవ్ర కరవు పరిస్థితులకు, అకాల వర్షాలకు కారణమవుతోంది. దీనివల్ల తాగునీటి ఎద్దడి, సాగునీటి కొరత, ఆహార సంక్షోభం, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. ఈ విపత్తును ఎదుర్కోవడానికి కేవలం ప్రభుత్వంపైనే భారం వేయకుండా.. ప్రభుత్వ యంత్రాంగం, సామాన్య ప్రజలు సంయుక్తంగా బాధ్యత వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒకవైపు ఆకాశం నుంచి కురిసిన వర్షపు నీరు వృథాగా సముద్రంలో కలుస్తోంది.. మరోవైపు గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీటి కోసం ప్రజలు ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఒకప్పుడు నీటితో కళకళలాడిన చెరువులు నేడు కబ్జాలకు గురవుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. బోర్లు ఎండిపోతున్నాయి. అయినా మన నీటి వినియోగపు అలవాట్లలో ఆశించిన మార్పు రావడం లేదు. ఈ పరిస్థితి ప్రకృతి వైపరీత్యం మాత్రమే కాదు.. మన నిర్లక్ష్యానికి కూడా అద్దం పడుతోంది. నీటి సంక్షోభం ముంచుకొచ్చిన తర్వాత పరిష్కారాల కోసం పరుగులు తీయడం కంటే, నీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే నిజమైన అభివృద్ధి. తగ్గుతున్న జలవనరులు.. పెరుగుతున్న ముప్పు జలం లేనిదే జీవం లేదు. వ్యవసాయం, పరిశ్రమలు, ప్రజారోగ్యం, పర్యావరణం.. ఇలా ప్రతి రంగానికీ నీరే ఆధారం. కానీ పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, భూగర్భజలాల అధిక వినియోగం, చెరువులు కుంటల ఆక్రమణలు, వర్షపు నీటి సంరక్షణలో నిర్లక్ష్యం జలవనరులపై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయి. పట్టణాల్లో కాంక్రీటు నిర్మాణాలు విస్తరించడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశాలు తగ్గుతున్నాయి. గ్రామాల్లో సంప్రదాయ జలవనరుల నిర్వహణ బలహీనపడుతున్న ప్రాంతాల్లోనూ నీటి లభ్యత సమస్యగా మారుతోంది. వర్షాలు పడినప్పుడు నీటిని నిల్వ చేసుకోలేక పోవడం, ఎండాకాలంలో నీటి కోసం ఇబ్బందులు పడటం మన జల నిర్వహణలోని లోపాలను స్పష్టం చేస్తున్నాయి. భూమిలోకి చేరుతున్న నీటికంటే బోర్లద్వారా తోడుతున్న నీరు ఎక్కువైతే భూగర్భజలాల మట్టం తగ్గిపోవడం తప్పదు. దీని ప్రభావం తాగునీటి సరఫరాపైనే కాకుండా వ్యవసాయ ఉత్పత్తి, రైతుల ఆదాయం, కుటుంబాల ఆర్థిక పరిస్థితిపైనా పడుతుంది. ప్రతి ఇంటి నుంచే మార్పు మొదలవ్వాలి. నీటి సమస్యను ప్రభుత్వం మాత్రమే పరిష్కరించలేదని, ప్రజలు మాత్రమే పరిష్కరించలేరని గుర్తించాలి. ఇరువురి భాగస్వామ్యం తప్పనిసరి. వర్షాకాలంలో ఇంటి పైకప్పుపై పడే వర్షపు నీటిని సేకరించి భూమిలోకి ఇంకేలా చేయడానికి ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సేకరణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. నీటి సంరక్షణ అంటే నీటిని తక్కువగా వినియోగించడం మాత్రమే కాదు.. వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భజలాలను పెంచడం, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా ఉపయోగించడం కూడా. ప్రభుత్వాల బాధ్యత మరింత కీలకం. జలసంరక్షణలో ప్రభుత్వాలు మాటలకే పరిమితం కాకుండా ఫలితాలు కనిపించే చర్యలు చేపట్టాలి. ముందుగా గ్రామాలు, పట్టణాల్లోని చెరువులు, కుంటలు, కాలువలు, ఇతర సహజ జలవనరులపై సమగ్ర సర్వే నిర్వహించాలి. ఆక్రమణలను చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా తొలగించి, నీరు చేరే మార్గాలను పునరుద్ధరించాలి. అవసరమైన చోట పూడికతీత చేపట్టి, చెరువుల నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. వర్షపు నీరు సహజంగా ప్రవహించే మార్గాలు మూసుకుపోకుండా చర్యలు తీసుకోవాలి. కొత్త భవనాల్లో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు అయ్యేలా చూడాలి. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల్లో ఈ వ్యవస్థల నిర్వహణను పర్యవేక్షించాలి.ఇంకుడు గుంతలు నిర్మించడం వరకే కాకుండా అవి సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అన్నది కూడా పరిశీలించాలి. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు తమ పరిధిలోని నీటి లభ్యత, వినియోగం, వృథా, భూగర్భజలాల పరిస్థితిని అంచనా వేసి స్థానిక జల ప్రణాళికలు రూపొందించాలి. తాగునీటి పైపుల లీకేజీలను త్వరగా సరిచేయాలి. నీటి సరఫరాలో జరిగే నష్టాలను తగ్గించాలి. నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించి ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలి. వ్యవసాయ రంగంలో నీటి వినియోగాన్ని మెరుగుపరచడం అత్యవసరం. రైతులకు బిందు సేద్యం, తుంపర సేద్యం వంటి సూక్ష్మ సేద్య పద్ధతులపై అవగాహన కల్పించాలి. నేల స్వభావం, వర్షపాతం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా శాస్త్రీయ సలహాలు అందించాలి. అవసరానికి మించి నీటిని పెట్టకుండా పంట అవసరాన్ని బట్టి సాగునీటిని అందించే పద్ధతులను ప్రోత్సహించాలి. చెరువులు, కుంటలు, చిన్న నీటి నిల్వ కేంద్రాలను పునరుద్ధరించి వర్షపు నీటిని వ్యవసాయానికి ఉపయోగపడేలా చేయాలి. రైతులకు సాంకేతిక సహాయం, శిక్షణ, సూక్ష్మ సేద్య పరికరాలకు తగిన ప్రోత్సాహకాలు అందించాలి. మరిన్ని కనుగొనండి వార్తాపత్రిక యాక్సెస్ ప్రాంతీయ వార్తలు సేవ రాష్ట్ర వార్తలు సేవ మురుగునీటిని శుద్ధి చేసి, తాగునీరు అవసరం లేని పారిశ్రామిక, ఇతర పనులకు ఉపయోగించే వ్యవస్థలను పట్టణాల్లో బలోపేతం చేయాలి. జలసంరక్షణకు జవాబుదారీతనం అవసరం ప్రభుత్వాలు పథకాలు ప్రకటించడం, నిధులు కేటాయించడం మాత్రమే సరిపోదు. వాటి అమలును నిరంతరం పర్యవేక్షించాలి. స్థానిక ప్రజలు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలను పర్యవేక్షణలో భాగస్వాములను చేయాలి. ఈ రోజు మనం కాపాడే ప్రతి నీటి బొట్టు రేపటి తరాల జీవనానికి భరోసా కావాలి. నీటి కోసం భవిష్యత్తులో యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి రాకుండా ఉండాలంటే, ఈ రోజే జలసంరక్షణకు నడుం బిగించాలి. ప్రభుత్వాలు బాధ్యతతో ముందడుగు వేయాలి.. ప్రజలు భాగస్వాములు కావాలి.. జలసంరక్షణ ప్రతి ఇంటి సంకల్పంగా, ప్రతి గ్రామం లక్ష్యంగా, ప్రతి ప్రభుత్వ వ్యవస్థ కర్తవ్యంగా మారాలి. నీటిని కాపాడుకుందాం.. భవిష్యత్తును నిలబెట్టుకుందాం!



# సాయిదుర్గ తేజ్ కొత్త సినిమాలో 'కాంతార' బ్యూటీ..

## అటవీ నేపథ్యంలో భారీ యాక్షన్ డ్రామా!

మెగా సుప్రీం హీరో సాయిదుర్గా తేజ్ వరుసగా విభిన్న కథాంశాలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలు వైవిధ్యమైన చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ఆయన.. ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు సమాచారం. దర్శకుడు తేజ కాకుమాను తెరకెక్కించనున్న ఈ సినిమాను నిర్మాత అనిల్ సుంకర నిర్మించనున్నారు. అటవీ నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం రూపొందనుందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. సాయిదుర్గా తేజ్, తేజ కాకుమాను కాంబినేషన్‌లో రానున్న ఈ కొత్త సినిమా కథాంశంపై ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో అడవి నేపథ్యంలో సాగే సన్నివేశాలు, భారీ యాక్షన్ ఎపిసోడ్లు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సమాచారం. గ్రాఫిక్స్, విజువల్ ఎఫెక్ట్స్‌కు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, ఈ నెలాఖరులో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించే యోచనలో చిత్రబృందం ఉన్నట్లు సమాచారం. అయితే షూటింగ్ ప్రారంభ తేదీ, కథాంశానికి సంబంధించిన పూర్తి వివరాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ సినిమాలో సాయిదుర్గా తేజ్‌కు జోడీగా కన్నడ నటి సప్తమి గౌడ నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. 'కాంతార' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. ఈ సినిమాలో కథానాయికగా ఎంపికైనట్లు ప్రచారం జరుగుతోంది. అయితే చిత్రబృందం నుంచి పూర్తి క్లారిటీ రావాల్సి ఉంది. సప్తమి గౌడ గతంలో నితిన్ నటించిన 'తమ్ముడు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. అలాగే హిందీ చిత్రం 'ది వ్యాక్సిన్ వార్'లోనూ నటించారు. కన్నడ చిత్ర పరిశ్రమలో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న ఆమెకు సాయిదుర్గా తేజ్ సరసన అవకాశం వస్తే, అది ఆమె కెరీర్‌కు మరో ముఖ్యమైన ప్రాజెక్ట్‌గా నిలిచే అవకాశం ఉంది. మరోవైపు సాయిదుర్గా తేజ్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'సంబరాల ఏటిగట్టు'పై కూడా అంచనాలు ఉన్నాయి. రోహిత్ కేపీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ చిత్రాన్ని ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తోంది. కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

# నవంబర్ 1న ఆర్‌సీ17 పూజా కార్యక్రమాలు



గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ మరియు క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న ప్రాజెక్ట్ ఆర్‌సీ 17 ఇండస్ట్రీలో సంచలనాత్మక విజయాలను నమోదు చేసిన 'రంగస్థలం' చిత్రం తర్వాత ఈ క్రేజీ కాంబో మరోసారి రిపీట్ అవుతుండటంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఈ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుందా అని మెగా అభిమానులు మరియు సినీ ప్రియులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న తరుణంలో, ఎట్టకేలకు మేకర్స్ నుంచి మోస్ట్ ఎవైటెడ్ అఫీషియల్ అప్‌డేట్ వచ్చేసింది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను మొదటగా దసరా పండుగ రోజునే అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలతో లాంచ్ చేయాలని చిత్ర యూనిట్ భావించింది. అయితే ఆ సమయంలో ముహూర్తం సరిపడకపోవడం మరియు కొన్ని సాంప్రదాయ కారణాలరీత్యా ఈ ఓపెనింగ్ కార్యక్రమాన్ని కొద్దిరోజులు వాయిదా వేయాల్సి వచ్చింది. ఆ తర్వాత అక్టోబర్ చివరి వారంలో ఈ సినిమా లాంఛింగ్ ఉంటుందని మైత్రీ మూవీ మేకర్స్ సహ నిర్మాత వై.రవిశంకర్ గతంలో హింట్ ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా జరిగిన ఒక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సినిమా పూజా కార్యక్రమాలకు సంబంధించిన ఖచ్చితమైన తేదీని అధికారికంగా రివీల్ చేశారు. వచ్చే నెల నవంబర్ 1వ తేదీన ఎంతో గ్రాండ్‌గా ఆర్‌సీ 17 పూజా కార్యక్రమాలను నిర్వహించి ఈ చిత్రాన్ని అధికారికంగా లాంచ్ చేయబోతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కేవలం పూజతో సరిపెట్టకుండా, లాంఛింగ్ పూర్తయిన వెంటనే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా రెగ్యులర్ షూటింగ్ పనులను కూడా శరవేగంగా ప్రారంభించేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. సుకుమార్ మార్క్ మేకింగ్, రామ్‌చరణ్ గ్లోబల్ ఇమేజ్ తోడవుతుండటంతో ఈ సినిమా ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఎట్టకేలకు సినిమా ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు కావడంతో మెగా అభిమానులు ప్రస్తుతం ఫుల్ ఖుష్ అవుతున్నారు మరియు సోషల్ మీడియాలో ఈ అప్‌డేట్‌ను ట్రెండ్ చేస్తున్నారు.

# సూర్య సినిమా కోసం 'కల్ట్' టైటిల్ అడిగారు.. కానీ నేను ఇవ్వలేదు విశ్వక్ సేన్

టాలీవుడ్ మాస్ కా దాస్ విశ్వక్ సేన్ తాజాగా నటిస్తూ, స్వయంగా దర్శకత్వం వహిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ కల్ట్. ఈ సినిమా టైటిల్‌కు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన వార్త టాలీవుడ్ వర్గాల్లో తెగ చక్కర్లు కొడుతోంది. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటించబోయే ఒక భారీ సినిమా కోసం చిత్ర యూనిట్ సభ్యులు ముందుగా ఈ 'కల్ట్' టైటిల్‌ను తమకు ఇవ్వాలని అడిగినట్లు విశ్వక్ సేన్ స్వయంగా వెల్లడించారు. తమ సినిమా కథకు మరియు నేపథ్యానికి ఈ టైటిల్ అత్యంత సరిగ్గా సరిపోతుందని వారు భావించినట్లు ఆయన తెలిపారు. అయితే, ఆ టైటిల్ తన సినిమాలోని పాత్రకు, కథాంశానికి మరింత పర్ఫెక్ట్‌గా సూట్ అవుతుందని గట్టిగా నమ్మడంతో, సూర్య టీమ్ అడిగినప్పటికీ తాను ఆ టైటిల్‌ను ఇవ్వడానికి సున్నితంగా నిరాకరించినట్లు విశ్వక్ సేన్ స్పష్టం చేశారు. అయితే, అది సూర్య నటించబోయే ఏ సినిమాకు సంబంధించిన టైటిల్ అనే దానిపై మాత్రం ఆయన ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ప్రస్తుతం ఈ ఇంట్రెస్టింగ్ మేటర్ టాలీవుడ్ మరియు కోలీవుడ్ సినీ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారగా, దీనికి సంబంధించిన చర్చలు సోషల్ మీడియాలో జోరుగా సాగుతున్నాయి.



# రాముడు, సీత ప్రేమకు సంగీత రూపం..

## 'రామాయణ' నుంచి 'రంగులు రంగులే' పాట విడుదల!



భారతీయ ఇతిహాసం 'రామాయణం' ఆధారంగా తెరకెక్కుతున్న భారీ చిత్రం నుంచి విడుదలవుతున్న ప్రతి ప్రచార చిత్రం, పాట ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి మూడో పాటగా 'రంగులు రంగులే' విడుదలైంది. శ్రీరాముడు, సీతాదేవి మధ్య ఉన్న ప్రేమానుబంధాన్ని ఆవిష్కరిస్తూ రూపొందించిన ఈ పాట శ్రోతలను ఆకట్టుకుంటోంది. మధురమైన సంగీతం, హృద్యమైన సాహిత్యం, అందమైన దృశ్యాలతో పాటను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ఈ పాటకు ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. ఆయన తనదైన శైలిలో మధురమైన స్వరాలను, ఆకట్టుకునే సంగీత వాయిద్యాలను మేళవించి పాటను రూపొందించారు. గేయ రచయిత రాకేందు మౌళి అందించిన సాహిత్యం రాముడు, సీతల మధ్య ఉన్న అనుబంధాన్ని, వారి భావోద్వేగాలను ప్రతిబింబించేలా ఉంది. రాఘవ్ కౌశిక్, వైశాలి సామంత్ తమ స్వరాలతో పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. 'రంగులు రంగులే' పాటలో రాముడు, సీతల జీవిత ప్రయాణంలోని కీలక ఘట్టాలను చూపించారు. స్వయంవరంలో తొలిసారి కలుసుకోవడం, ఆ తర్వాత వివాహ బంధంతో ఒక్కటవడం, అయోధ్యలో కలిసి గడిపిన మధుర క్షణాలు, అరణ్యవాసానికి బయలుదేరడం వంటి సన్నివేశాలు పాటలో కనిపిస్తాయి. ఈ దృశ్యాల ద్వారా వారి ప్రేమలోని ఆప్యాయత, పరస్పర అనుబంధం, జీవితంలో ఎదురైన కీలక మలుపులను చూపించే ప్రయత్నం చేశారు. రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతాదేవిగా సాయి పల్లవి నటిస్తున్నారు. వీరిద్దరూ తెరపై కనిపించే తీరు, పాత్రలకు అనుగుణంగా వారి హావభావాలు ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. భారీ స్థాయిలో రూపొందుతున్న 'రామాయణ'ను రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. మొదటి భాగాన్ని నవంబరు 5న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. తాజాగా విడుదలైన 'రంగులు రంగులే' పాట రాముడు, సీతల ప్రేమకథను సంగీత రూపంలో ఆవిష్కరించడంతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది.